


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | శనివారం 12-12-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:112 | పేజీలు:4 | వెల: రూ.1/-


# గోరటి కూతురు పెళ్లికి హాజరైన కెసిఆర్



హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ప్రముఖ కవి , ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కుమార్తె వివాహానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకకు మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సినీ నటుడు, దర్శకులు ఆర్ నారాయణమూర్తి హాజరయ్యారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు హాజరై ఆశీర్వదించారు.

## ఢిల్లీకి బయలుదేరిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,డిసెంబర్11 (ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కే సీఆర్ ఢిల్లీ పర్యటనకు బయలుదేరారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లారు. మూడురోజులపాటు ఢిల్లీలో ఉండనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. దీర్ఘకాలికంగా పెండిగ్‌లో ఉన్న పలు సమస్యలపై చర్చించేందుకు కేంద్ర మంత్రులతో భేటీకానున్నారు. ఇందులో భాగంగా ఇవాళ కేంద్ర జలవనరులశాఖ మంత్రి గజేంగ్రసింగ్ షెకావత్‌ను, రేపు పౌరవిమానయాన, హౌసింగ్‌శాఖల మంత్రి హర్దీవ్‌సింగ్ పురిని కలువనున్నట్టు సమాచారం. ఈ ఇద్దరు మంత్రులతో భేటీకి సంబంధించిన షెడ్యూల్ ఖరారైనట్టు తెలిసింది. అదేవిధంగా కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్‌తో సీఎం కేసీఆర్ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఆదివారం ఆయన తిరిగి హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

# బిజెపి అధ్యక్షుడు నడ్డాపై దాడికి కేంద్రం సీరియస్

**శాంతిభద్రతలపై రాష్ట్ర డిజిపికి కేంద్రహోంశాఖ సమన్లు**
**నివేదిక సమర్పించిన గవర్నర్ జగ్‌దీప్ ధన్‌కర్**
**నిప్పుతో చెలగాలం వద్దంటూ మమతకు హెచ్చరిక**

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా కాన్వాయ్‌పై రాళ్ల దాడి నేపథ్యంలో పశ్చిమబంగాల్‌లో శాంతి భద్రతల పరిస్థితులపై కేంద్ర హోంశాఖ ఆ రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీకి సమన్లు జారీ చేసింది. డిసెంబరు 14న హోంశాఖ కార్యదర్శి ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. జేపీ నడ్డా పశ్చిమబంగాల్‌లో పర్యటిస్తున్న సమయంలో ఆయన కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం కోల్‌కతా నుంచి 24 పరగణాల జిల్లాలోని డైమండ్ హార్బర్‌లో పార్టీ కార్యకర్తల సమావేశానికి నడ్డా వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మోటారుసైకిళ్లపై వచ్చిన కొందరు దుండగులు ఇటుకలకు, రాళ్లు, కర్రలతో వాహనశ్రేణిపై దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. కాగా.. ఈ దాడికి పాల్పడింది తృణమూల్ కార్యకర్తలే అని భాజపా ఆరోపించగా.. అంతా నాటకమంటూ బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కొట్టిపారేయడం గమనార్హం. నడ్డా కాన్వాయ్‌పై దాడిని బంగాల్ గవర్నర్ జగ్‌దీప్ ధన్‌కర్ తీవ్రంగా ఖండించారు. ఘటనపై కేంద్రహోంశాఖకు నివేదిక పంపారు. నడ్డా పర్యటనకు భద్రత కల్పించడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. స్థానిక పోలీసులు ప్రొటోకాల్ పాటించకపోవడం వల్లే ఘటన జరిగిందని అన్నారు. నడ్డా పర్యటన గురించి స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ పోలీసులు భద్రత కల్పించలేదని గవర్నర్ నివేదికలో పేర్కొన్నారు. సీఎం మమతా బెనర్జీ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని గవర్నర్ కోరారు. మేడం, నిప్పుతో చెలగాటం ఆడకండి అంటూ ఆయన దీదీకి హెచ్చరికలు కూడా జారీ చేశారు. బెంగాల్‌లో క్షీణిస్తున్న శాంతిభద్రతల అంశంపై నివేదికను కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్ ధన్‌ఖర్ సమర్పించారు. కోల్‌కతాలోని డైమండ్ హార్బర్ వద్ద నడ్డా కాన్వాయ్‌పై రాళ్లు, ఇటుకలతో దాడి జరిగింది. ఆ ఘటన జరగడం దురదృష్టకరమని, ప్రజాస్వామ్యానికి మచ్చ అని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ.. రాజ్యాంగాన్ని ఫాలో అవ్వాలని, చాలా కాలం నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నట్లు గవర్నర్ జగదీప్ తెలిపారు.

మరోవైపు దాడిపై కేంద్ర హోంశాఖ బంగాల్ ప్రభుత్వాన్ని కూడా నివేదిక అడిగింది. ఇదిలా ఉండగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా త్వరలోనే పశ్చిమబంగాల్ వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 19, 20వ తేదీల్లో ఆయన కోల్‌కతాలో పర్యటించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నడ్డా వాహనశ్రేణిపై రాళ్ల దాడి నేపథ్యంలో అమిత్ షా పర్యటన వార్తలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# తెలంగాణ అభివృద్ధికి పాటుపడండి

**కేవలం గజ్వేల్,సిద్దిపేటలకే అభివృద్ధి పరిమితమా?**
**దుబ్బాక బస్టాండ్ ఏం పాపం చేసుకుంది**
**ఇచ్చిన హామీలను అమలు చేయండి**
**సిద్దిపేట సభలో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై ఫిర్యాదు**
**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రఘునందన్ రావు**

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ తెలంగాణకు సీఎంలా కాకుండా కేవలం రెండు నియోజకవర్గాలకు మాత్రమే సీఎంలా ప్రవర్తిస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. సిద్ధిపేటలాగే దుబ్బాకను కూడా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం మళ్లీ దుబ్బాకను నిర్లక్ష్యం చేస్తున్నారు. సిద్ధిపేటకు ఇచ్చిన వరాలు దుబ్బాకకు కూడా ఇవ్వాలని శుక్రవారం నాడిక్కడ మీడియా సామవేశంలో డియమాండ్ చేశారు. దుబ్బాకకు మరో వెయ్యి ఇండ్లు మంజూరు చేయాలన్నారు. సిద్దిపేటకు ఏం ఇచ్చారో.. దుబ్బాకకు కూడా అవన్నీ ఇవ్వాలని దుబ్బాక ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. దుబ్బాక ఉపఎన్నికలో ఓటమి తర్వాతైనా మారతారని అనుకున్నాం. కానీ, ఇంకా అదే పద్దతిలో ముందుకు వెళ్తున్నారు. కొడుకు కోసం కొత్త సెక్రటేరియట్, అల్లుడి కోసం మెడికల్ కాలేజీ, మనవడి కోసం గజ్వేల్ డెవలప్‌మెంట్.. ఇవి తప్ప ఇంకేం లేవా? అని ప్రశ్నించారు. సిద్ధిపేటకు త్వరలోనే కొత్త ఎయిర్‌పోర్టు వస్తుందని సీఎం అన్నారు. ఆ ఎయిర్‌పోర్టు మీరు తెచ్చుకోండి లేకపోతే ఊరుకోండి. కానీ, మా దుబ్బాకలో కూలిపోయే స్థితిలో ఉన్న ఒక పాత బస్టాండ్ ఉంది. దాని స్థానంలో కొత్త బస్టాండ్‌కు నిధులు మంజూరు చేయండని అన్నారు. మీ నియోజకవర్గానికి ఎయిర్‌పోర్టు.. మా దుబ్బాకకు మాత్రం పాత బస్టాండేనా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్మించిన ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు 2004లో పూర్తయ్యింది. అప్పుడు జీఎంఆర్ సంస్థకు, సివిల్ ఏవియేషన్‌కు మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం మార్చి 23, 2033 దాకా హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు 150 కిలోమీటర్ల పరిధిలో కొత్త ఎయిర్‌పోర్టు నిర్మించడానికి అనుమతులేవు. అలాంటప్పుడు సిద్ధిపేటలో కొత్త ఎయిర్ పోర్టు ఎలా వస్తుంది. సీఎం కేసీఆర్ మూడేండ్ల కింద వరంగల్‌లో కొత్త ఎయిర్‌పోర్టు వస్తుందని చెప్పారు. అది ఇంతవరకు రాలేదు. ఇప్పుడు చెప్పిన సిద్ధిపేటలో కూడా అదే పరిస్థితి పునరావృతమవుతుంది. త్వరలోనే వరంగల్, సిద్ధిపేట, ఖమ్మంలలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. అందుకే సీఎం కేసీఆర్ ఈ మాటలు చెబుతున్నాడు. ఓట్ల కోసం మరోసారి ప్రజలను మభ్యపెడుతున్నాడని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్, రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసు ఉన్నతాధికారులు అంతా కలిసి ఓట్ల కోసం ఈ వరాల జల్లు కురిపిస్తున్నారని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలు అమలుచే సేందుకు ముందు కృషి చేయాలన్నారు. వరంగల్ జిల్లాలో ఇళ్లు నిర్మిస్తామని అన్నారు. వాటిన ఇపూర్తి చేయలేదు. జర్నలిస్టులకు ఇల్లు ఇస్తామని హామీని విస్మరించారు. రాజకీయాల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలని బిజెపి ఎమ్మెల్యే అన్నారు. ఇకపోతే సిద్ధిపేట సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందనరావు మండిపడ్డారు. దుబ్బాక ప్రజలు తమ వివక్షను తిప్పికొట్టినా.. సీఎం తన తీరును మార్చుకోలేదన్నారు. సిద్ధిపేట, వరంగల్, ఖమ్మం, మున్సిపల్ ఎన్నికల కోసమే ముఖ్యమంత్రి మాటల మాంత్రికుడి అవతారం ఎత్తాడని ఎద్దేవా చేశారు. జిల్లా ఎమ్మెల్యేగా ఉన్న తనను వేదిక మీదకు పిలవకుండా ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల ప్రారంభోత్సవాన్ని సీఎం కల్వకుంట్ల పేరంటంగా మార్చివేశారన్నారు. దుబ్బాకలో వంద పడకల ఆసుపత్రిని వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌కు మాత్రమే రింగ్ రోడ్డులు వేశారని.. దుబ్బాక ప్రజలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. సిద్ధిపేట వంద రూపాయలు ఇస్తే.. దుబ్బాకకు కూడా వంద రూపాయలు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశారు. ఎస్ఈసీ, పోలీస్ అధికారులతో కలసి ప్రభుత్వం కుట్రతో కార్పోరేషన్ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వబోతోందన్నారు. సీఎం ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్, శాసనసభ సెక్రటరీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రంగనాయక సాగర్‌లో కన్వెన్షన్ సెంటర్లు దేవుడెరుగు.. మండలం కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు కట్టాలని ప్రజలు కోరుతున్నారని ఎమ్మెల్యే రఘునందనరావు పేర్కొన్నారు.

# వరంగల్ ఆస్పత్రికి నిధులు ఇచ్చిన ఉపయోగించలే

**కేంద్ర నిధులను పక్కకు పెట్టిన రాష్ట్రప్రభుత్వం**
**వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సందర్శన**
**భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు**
**ప్రజలు కుటుంబ పాలన నుంచి విముక్తి కోరుతున్నారు**
**తెలంగాణ ఆకాంక్షల మేరకు బిజెపి కృషి చేస్తుంది**
**జిల్లా పర్యటనలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

వరంగల్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): వరంగల్ జిల్లాకు ఆస్పత్రి అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను వినియోగించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇచ్చిన నిధులను కూడా ఖర్చు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లాలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. పర్యటనలో భాగంగా కాకతీయ మెడికల్ కాలేజీలో పీఎంఎస్ఎస్‌వై కింద 150 కోట్లతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ గరికపాటి మోహన్‌రావు పరిశీలించారు. హాస్పిటల్లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాల, పరికరాలను వాటి పనితీరుపై వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కార్ రాష్ట్రానికి రెండు మెడికల్ కాలేజీలు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. వరంగల్‌కు కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని కేంద్రం ఇచ్చిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వక పోవడంతోనే ఆస్పత్రి ప్రారంభం కాలేదని తెలిపారు. పోస్ట్ పీజీకి సంబంధించిన సీట్లు మంజూరైనా.. ఆస్పత్రిని ప్రారంభించడంలో ఆలస్యం చేస్తున్నారని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రకాళి ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వరంగల్ పర్యటనకు వెళుతూ జనగామలో కాసేపు ఆగారు. తెలంగాణలో కుటుంబ పాలన ,అవినీతిపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని.. అందుకే మార్పు కోరుకుంటున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. వరంగల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సందర్శిస్తానని తెలిపారు. తెలంగాణ ప్రజలు మార్పు రావాలని కోరుకుంటున్నారు.. అది దుబ్బాక, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనే కాకుండా మొత్తం రాష్ట్రవ్యాప్తంగా వస్తుంది.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు జరుగుతున్నాయని వివరించారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్ష, ఉద్యమ కారుల ఆకాంక్షలను బీజేపీ నెరవేరుస్తుందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వాన అద్భుతమైన పాలన అందిస్తోందని.. కావాలని పనికట్టుకుని కొన్ని రాజకీయ పార్టీలు రైతులను అయోమయానికి గురిచేస్తున్నాయని విమర్శించారు. రైతు వ్యవసాయ చట్టంలో ఏ ఒక్క అంశం కూడా రైతులకు వ్యతిరేకంగా లేదన్నారు. దేశవ్యాప్తంగా పంజాబ్లో తప్ప ఏ రాష్ట్రంలో కూడా ఈ బిల్లును వ్యతిరేకించడం లేదన్నారు. శరద్ జోషి ,స్వామినాథన్, వ్యవసాయ శాస్త్రవేత్తలు,మేధావులు వ్యవసాయ బిల్లుకు మద్దతు పలికారని చెప్పారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలకు ప్రజలతో సంఘటితంగా ఉండి ముందుకు సాగుతాం.. వరంగల్ పర్యటన అనంతరం దివంగత నేత నోముల నర్సింహయ్య కుటుంబాన్ని పరామర్శిస్తానని కిషన్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట జిల్లా బిజెపి నేతలు పలువురు పాల్గొన్నారు.

# వ్యవసాయ చట్టాలపై సుప్రీంలో సవాల్

**కార్పోరేట్లకు బలవుతామని పిటిషన్**
**ధరల నిర్ణయం కోసం రైతు కమిటీలు వేయాలని వినతి**

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): కొత్త వ్యవసాయ చట్టాలను సవాలు చేస్తూ భారతీయ కిసాన్ యూనియన్ శుక్రవారం సుప్రీంకోర్టు గడప తొక్కింది. ఈ కొత్త చట్టాల వల్ల రైతులు కార్పొరేట్లకు బలవుతారని రైతులు తమ పిటిషన్‌లో వాదించారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ రెండు వారాలుగా దేశ రాజధానిలో పంజాబ్, హర్యానా రైతులు ఆందోళన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపినా.. ఫలితం లేకుండా పోయింది. తాజాగా కేంద్రం పంపిన ప్రతిపాదనలను కూడా రైతులు తిరస్కరించారు. ఈ చట్టాలను నిరసిస్తూ.. డిసెంబర్ 14న దేశవ్యాప్తంగా ఆందోళనలకు రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. భారతీయ కిసాన్ యూనియన్ బీకేయూ నూతన వ్యవసాయ చట్టాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ చట్టాలు అమలైతే కార్పొరేట్ సంస్థల దురాశకు తాము బాధితులుగా మారిపోతామని ఆందోళన వ్యక్తం చేసింది. వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణయం కోసం రైతు కమిటీని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ దాఖలు చేసిన పిటిషన్‌లో ఇంటర్వెన్షన్ అప్లికేషన్ దాఖలు చేసింది. ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ యాక్ట్; ఫార్మర్స్ ఎంపవర్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్ అగ్రిమెంట్ ఆఫ్ ప్రైస్ అండ్ ఫార్మ్ సర్వీసెస్ యాక్ట్, ఎసెన్షియల్ కమోడిటీస్ అమెండ్‌మెంట్ యాక్ట్‌లను రైతులు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. వేలాది మంది రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 14న దేశవ్యాప్తంగా ధర్నాలు చేయాలని నిర్ణయించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తోమర్, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో రైతు సంఘాల చర్చలు విఫలమయ్యాయి. రైతుల ఆందోళనను అర్థం చేసుకుని ఈ చట్టాల్లో కొన్ని సవరణలకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. రైతులతో చర్చలు కొనసాగుతున్నట్లు కేంద్ర మంత్రి తోమర్ చెప్పారు. ఈ చట్టాలు చట్టవిరుద్ధమని, నిరంకుశత్వంతో చేసినవని, వ్యవసాయోత్పత్తుల వ్యాపారీకరణ, ధరల పెరుగుదలకు బాటలు పరుస్తాయని భాను ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని బీకేయూ-భాను తన పిటిషన్‌లో ఆరోపించింది. ఈ చట్టాలు అమలైతే దేశం నాశనమవుతుందని, కరువు కాటకాలు వచ్చే ప్రమాదం ఉందని, ఒకేసారి ఎటువంటి నియంత్రణలు లేకుండా వ్యవసాయోత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తారని పేర్కొంది. వ్యవసాయోత్పత్తులకు న్యాయమైన ధరలకు హామీ ఇస్తున్న అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీల వ్యవస్థ ధ్వంసమవుతుందని తెలిపింది. కార్పొరేట్ సంస్థల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడవలసిన పరిస్థితి ఎదురవుతుందని పేర్కొంది. లాభార్జనే ధ్యేయంగా పని చేసే కార్పొరేట్ సంస్థలు పేద రైతుల పరిస్థితులను పట్టించుకోవని ఆరోపించింది. చాలా మంది రైతులు నిరక్షరాస్యులైనందువల్ల ప్రైవేటు కంపెనీలతో చర్చలు జరపే సామర్థ్యం ఉండదని, బేరమాడటంలో అసమానతలు తలెత్తుతాయని తెలిపింది. వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణయం కోసం రైతు కమిటీని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ కమిటీలో అధ్యక్షుడితో సహా సభ్యులంతా కచ్చితంగా నిజమైన రైతులే ఉండాలని పేర్కొంది.

# వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

**లాంఛనంగా ప్రారంభించిన సిఎస్ సోమేశ్ కుమార్**
**ఒక్కో కార్యాలయంలో రోజుకు24 స్లాట్ బుకింగ్స్**

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్లాట్ బుకింగ్ ప్రక్రియను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ప్రారంభించారు. ఈ 14 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్న సందర్భంగా సీఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఒక్కో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 24 స్లాట్ల బుకింగ్ జరగనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ తర్వాత వెంటనే డాక్యుమెంట్లు అందజేస్తామన్నారు. ఎల్ఆర్ఎస్ లేనివారి విషయంలో కూడా త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇళ్లు, ప్లాట్లతో పాటు ఓపెన్ ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్ చేయొచ్చన్నారు. పెండింగ్ మ్యూటేషన్లు ధరణిలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 100 మంది అధికారులు, నిపుణులతో బీఆర్కే భవన్‌లో వార్ రూం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాల్ సెంటర్ 18005994788 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే ఈ-పాస్‌బుక్ ఇస్తామన్నారు. మెరూన్ రంగు పాసుపుస్తకాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో 16 లక్షల లావాదేవీల్లో 10 వేలే స్లాట్ బుకింగ్ ద్వారా జరిగేవి అన్నారు. ప్రస్తుతం వంద శాతం స్లాట్ బుకింగ్ ద్వారానే జరుగుతున్నాయన్నారు. రిజిస్ట్రార్లు సహా అధికారులు ఎవరికీ విచక్షణాధికారాలు ఉండవన్నారు. సులువుగా ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ద్వారా స్లాట్ల బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ముందుగా స్లాట్ బుకింగ్ చేయకుండా రిజిస్ట్రేషన్లు లేవన్నారు. పీటీఐఎన్ సంఖ్య లేనివారు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అటువంటి వారికి రెండ్రోజుల్లో పీటీఐఎన్ సంఖ్య ఇస్తావన్నారు. ఆన్‌లైన్ లేదా చలానా ద్వారా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించొచ్చు. కొన్ని సేవలు తక్షణమే ప్రారంభం అయినట్లు తెలిపారు. అమ్మకం, గిఫ్ట్, సేల్ అగ్రిమెంట్, మార్ట్ గేజ్, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ తదితరాలు చేయొచ్చు అన్నారు. దాదాపుగా 96 శాతం సర్వీసులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. త్వరలోనే మిగతా సర్వీసులు కూడా ప్రారంభిస్తామన్నారు. ఆధార్ తప్పనిసరి కాదని ఆధార్ ఇవ్వని వారికోసం వేరే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ తర్వాత మ్యుటేషన్ కూడా ఆన్‌లైన్‌లో వెంటనే జరుగుతుందన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. డేటాకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపిన సీఎస్ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## సోలార్ విద్యుత్ సరఫరాపై ట్రాన్స్‌కోతో సింగరేణి డైరెక్టర్ భేటీ

హైదరాబాద్,డిసెంబర్ 11 : సింగరేణి సోలార్ విద్యుత్తు సరఫరాపై ట్రాన్స్ కోతో సింగరేణి డైరెక్టర్ (ఇఅండ్ఎం) శుక్రవారం సమావేశం అయ్యారు. సింగరేణి సోలార్ విద్యుత్తు, సరఫరా, వినియోగం, బిల్లింగ్, తదితర అంశాలపై సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ డైరెక్టర్ ఇఅండ్ఎం డి.సత్యనారాయణ రావు తెలంగాణా ట్రాన్స్ కో ఉన్నతాధికారులతో శుక్రవారం నాడు హైద్రాబాద్ సింగరేణి భవన్‌లో సమావేశమై చర్చించారు. ప్రధానంగా వివిధ ఏరియాల్లో గల సింగరేణి సోలార్ ప్లాంటుల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్తు, సరఫరా, వినియోగంలో ట్రాన్స్ కో వారి సహకారం, సేవలు, బిల్లింగ్ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.సింగరేణి సంస్థలో మణుగూరు సోలార్ ప్లాంటు, ఎస్‌టీపీపీ సోలార్ ప్లాంటు, ఆర్‌జీ-3 సోలార్ ప్లాంటుల నుండి ప్రస్తుతం 55 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అనతి కాలంలోనే మిగిలిన సోలార్ ప్లాంటుల నుండి విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభం కానుంది. స్టేజి-1లోని అన్ని ప్లాంటుల నిర్మాణం పూర్తయితే మొత్తం 300 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి జరుగుతుంది. ఈ విద్యుత్తును తెలంగాణా రాష్ట్ర ట్రాన్స్‌కోకు చెందిన స్థానిక గ్రిడ్‌లు, సబ్ స్టేషన్లకు అనుసంధానం చేస్తున్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ సవనము వలె క్రికెట్టును
చవులూరించెడి విధముగ చకచక నాడన్
"యువరాజ సింగు" పొందును
నవపథమున ప్రజల చేత నటశత చేయున్!

(డిసెంబర్ 12 యువరాజ్‌సింగ్ పుట్టిన రోజు...)

-రాధశ్రీ
సెల్: 9494481210



# పెండింగ్ వారెంట్ల అమలుతో ఫలిస్తున్న పోలీసుల కృషి

**పరిష్కారం దిశగా ముందుకుసాగుతున్న పెండింగ్ కేసులు**

కరీంనగర్. డిసెంబర్ 11 (నేటినిజం ప్రతినిధి): పెండింగ్ వారెంట్ల అమలుకు పోలీసులు చేస్తున్న కృషిఫలిస్తున్నది. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న వారెంట్లు అమలవుతుండటంతో వివిధ రకాల్లో నేరాల్లో నేరస్థులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. తప్పలితంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు ట్రయల్స్‌కు వస్తుండటంతో పెండింగ్ కేసులు పరిష్కారం దిశగా ముందుకుసా గుతున్నా యి. కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో దశాబ్దాలకాలం నుండి పెండింగ్‌లో ఉన్న వారెంట్లు రోజుల వ్యవధిలో అమలుచేసి కోర్టులో హాజరుపరిచారు. వివరాలు ఇలాఉన్నాయి.

**సైదాపూర్‌లో.....**

ఇతర వ్యక్తుల్లోని వ్యవసాయభూముల్లోకి చొరబడి, యజమానులను అడ్డుకున్న కేసుల్లో 2012నుండి నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతున్న పంగ పర్శరాములు అనే వ్యక్తిని ఈనెల 10న సైదాపూర్ ఎస్ఐ ప్రశాంత్ రావు ఆధ్వర్యంలోని ప్రత్యేక విభాగం పోలీసులు అతడి కదలికలపై నిఘా ఉంచి సిద్దిపేట జిల్లా తోర్నాల గ్రామానికి వెళ్ళి పెండింగ్ ఉన్న వారెంట్‌ను అమలు చేసి అదుపులోకి తీసుకున్నారు. 2012లో అదే మండలానికి చెందిన బత్తుల బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సంబంధిత న్యాయస్థానంలో హాజరు పరిచారు.

**కరీంనగర్ టూటౌన్ పరిధిలో...**

2006 జూన్ 24న లో కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన నళిమెల సుభాషిణి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి వారిని చంపుతానని బెదిరించిన కేసులో నిందితుడిగా ఉన్న మంకమ్మతోట ప్రాంతానికి చెందిన వ్యక్తి న్యాతరి శ్రీనివాస్ గత 13సంవత్సరాలుగా పరారీలో ఉండి వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్నాడు. సదరు నిందితుడి కదలికలపై ప్రత్యేక దృష్టిసారించిన పోలీసులు గత సెప్టెంబర్ 30 ఇంట్లోనే తలదాచుకుని ఉన్నాడనే సమాచారం మేరకు వెళ్ళి వారెంట్‌ను అమలు చేసి అరెస్ట్ అనంతరం సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరిచారు.

నెలనెలా వస్తున్న ఆదాయంలో కొంతను భవిష్యత్ అవసరాలకోసం వినియోగించుకోవడం కోసం చిట్టి వేసుకుని ఎత్తుకున్న కరీంనగర్‌లోని ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన కడార్ల కుమారస్వామికి చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేయడంతోపాటు మళ్ళీ వచ్చి అడిగితే ప్రాణాలు తీస్తానని బెదిరించిన కేసు కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2007 జనవరి 29న జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు అయిన మంకమ్మతోటకు చెందిన చిట్టిమల్ల శ్రీధర్ అప్పటి నుండి గత 13ఏళ్ళుగా పరారీలో ఉన్నాడు. పోలీసులు పక్కా సమాచారంతో గత సెప్టెంబర్ 21న వారెంట్ అమలుతోపాటు అరెస్ట్ చేసి సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరిచారు.

2001లో ప్రస్తుత జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ఓ ప్రాంతంలో బెదిరింపులకు గురిచేసి బలవంతంగా డబ్బులు వసూలు చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని పట్టుకునేందుకు మల్యాల నుండి వచ్చిన పోలీసులపై దౌర్జన్యం చేసి విధులకు ఆటకం కల్పించిన కేసులో పోలీసులు కరీంనగర్ టూటౌన్‌లో ఫిర్యాధు చేశారు. అప్పుడు సదరు నిందితుడు కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తా ప్రాంతంలో ఓ స్వీట్‌హౌజ్ నిర్వహిస్తున్నాడు. గత 12 సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న రాజ్‌పురోహిత్ విజయాసింగ్ అనే నిందితుడు ఈ మధ్యకాలంలో బొమ్మకల్ ప్రాంతంలో సంచరిస్తున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు అక్టోబర్ 09న అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

# ధాన్యం కొనుగోళ్లపై చిత్తశుద్ధి ఏదీ ?

నేటినిజం
శనివారం 12-12-2020

మొన్నటికి మొన్న వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ భారత్ బంద్ నిర్వహించారు. ఢిల్లీలో రైతుల ఆందోళన ఇంకా కొనసాగుతూనే ఉంది. రైతులకు ప్రధానంగా వచ్చే సమస్యలపై ఆయా రాజకీయ పార్టీలు ఎక్కడా చర్చించడం లేదు. ఎలా పరిష్కరించగలమో చెప్పడం లేదు. ఆందోళనలు చేయడమే తప్ప సమస్యలకు పరిష్కారం చూపే దిశలో రాజకీయ పార్టీలు లేవని అర్థం అవుతోంది. విపక్షాలు ఆందోళన చేయడమే గాకుండా పరిష్కారం చూపే దిశగా కార్యాచరణతో సిద్దంగా ఉండాలి. కానీ మనదేశంలో విపక్షాలు ఏ పార్టీ వారైనా సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణతో సిద్దంగా ఉండవు. ఉన్నా అవి ఎవరికీ ఆమోదయోగ్యంగా ఉండవు. ఇక తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ధాన్యం సేకరణ తీవ్ర ఇబ్బందులను ఎదర్కొంటోంది. పంట ఏదైనా అమ్ముకోవడానికి రైతులు నానా యాతన పడుతున్నారు. ప్రధానంగా వరి దిగుబడులు పెరిగాయి. తెలంగాణలో వాతావారణం అనుకూలించడంతో దిగుబడులు పెరిగితే.. ఆంధ్రాలో వరుస తుఫాన్ల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి దిగుబడిపై ఈ ఏడాది తెగుళ్లు తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి తోడు నివర్ తుఫాను కూడా వెంటాడింది. వీటన్నింటికీ ఎదురొడ్డి అన్నదాత చివరకు ధాన్యాన్ని ఒడ్డుకు తీసుకువచ్చే సమయానికి మార్కెట్లో ధర లేదు. సకాలంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే కొంత ఊరట కలుగుతుందని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పొలాల్లోనే ధాన్యాన్ని నిల్వ చేసుకుని, విక్రయించేందుకు పోరాడుతున్నారు. తెలంగాణలో నియంత్రిత సాగులో సన్నాలు పండించిన రైతులు నానాయాతన పడుతున్నారు. మక్కల సంగతి ఇక చెప్పాల్సిన పనిలేదు. మరోవైపు ఎపిలో వరి రైతుకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడి దారుణంగా పడిపోయింది. చివర్లో నివర్ తుఫాను పంటను మరింత దెబ్బతీసింది. అంతో.. ఇంతో.. పండిన ధాన్యాన్ని అమ్ముకుందామన్నా.. కొనేవారు కరువయ్యారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉండిపోయారు. దళారులు, వ్యాపారులు, అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తామంటున్నారు. ఆ ధరకు అమ్మితే పెట్టుబడి కూడా దక్కదని రైతులు ఆవేదన చెందు తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి, ఆదుకోవాలని వేడుకుంటున్నా రైతు భరోసా కేంద్రాల్లో కొనే దిక్కులేదని వాపోతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవటంతో నిరాశతో నిట్టూరుస్తున్నారు. కోతలు ప్రారంభించి, దిగుబడులపై రైతులు అంచనాలు వేస్తున్నారు. పండించిన ధాన్యానికి ధర ఎంతమేరకు అనే విషయంపై స్పష్టత లేదు. బహిరంగ మార్కెట్‌లో ధర పాతాళానికి పడిపోయింది. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. గతేడాది మాత్రం ప్రభుత్వం వద్దు కొనుగోలు కేంద్రాన్ని ఆలస్యంగా ప్రారంభించ టంతో ఖాళీ సంచుల సాకును చూపి, కొనుగోలు చేయకుండా చేతులెత్తేసింది. రబీలో మాత్రం కొనుగోలు చేసింది. ప్రస్తుతం వరి కోతలు ఒక్కసారిగా అన్ని చోట్లా ప్రారంభమవుతున్న నేపథ్యంలో నెల అప్పుతో రూ.1650కి కొనడానికి కొందరు వ్యాపారులు ముందుకొస్తున్నట్లు కనిపిస్తున్నా.. గిట్టుబాటు కాదని రైతులు వెనుకంజ వేస్తున్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక తెలంగాణలోనూ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో వరిసాగు చేసిన రైతులను కష్టాలు నష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. చేతికొచ్చిన ధాన్యం విక్రయాలకు సవాలక్ష సవాళ్లు ఎదురవుతున్నాయి. సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. సన్నరకం ధాన్యంతో ప్రభుత్వానికి లెవీ కింద ఇచ్చే బియ్యం తూకం రాకపోతుండటంతో తాము నష్టపోవాల్సి వస్తుందంటూ మిల్లర్లు కొనుగోళ్లకు మొఖం చాటేస్తున్నారు. ఇప్పటివరకు ధాన్యం నూర్పిడిలు 30నుంచి40శాతం కూడా పూర్తికాలేదు. ఇంకా 60శాతానికిపైగా ధాన్యం నూర్పిడులు జరగాల్సి ఉంది. ధాన్యాన్ని విక్రయించాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో మిల్లర్లు చేతులెత్తేశారు. సన్నరకం ధాన్యం క్వింటా ఒక్కంటికి ప్రభుత్వానికి మిల్లర్లు 67కిలోల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. అయితే సన్నరకం ధాన్యంతో క్వింటా ఒక్కంటికి 63నుంచి 64కిలోల బియ్యం మాత్రమే వస్తున్నాయని దానివలన క్వింటాకు మూడుకిలోల బియ్యాన్ని తాము నష్టపోవాల్సి వస్తుందని మిల్లర్లు చెపుతున్నారు. దొడ్డురకం ధాన్యం అయితే తూకం ఉంటుందని తద్వారా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు బియ్యాన్ని ఇవ్వగల్గుతామని దానివల్ల తమకు ఎలాంటి నష్టం ఉండదని, సన్నరకం వలన క్వింటా ఒక్కంటికి మూడు, నాలుగు కిలోల బియ్యం నష్టాన్ని భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఒకవేళ రైతుల నుంచి తాము సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలంటే క్వింటా ఒక్కంటికి ఐదుకిలోల ధాన్యాన్ని తరుగు కింద భరిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కొనుగోలు కేంద్రాలకు కొందరు మిల్లర్లు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అటు రైతులు నష్టపోకుండా ఇటు మిల్లర్ల డిమాండ్‌ను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఈ పరిస్థితులు స్థానికంగా ఉంటున్న రాజకీయ నాయకులకు బాగా తెలుసు. అలాగే సమస్యలను ఎలా అధిగమించాలో కూడా తెలుసు. కేవలం ప్రభుత్వం మాత్రమే చొరవ తీసుకుని చివరిగింజవరకు కొంటామన్న హామీని నెరవేర్చాలి. మండలాల వారీగా సమస్యలను స్థానిక అధికారులు తీర్చేలా ఆదేశాలు ఇవ్వాలి. మిల్లర్లు పేచీ పెట్టకుండా చూడాలి. ఇవన్నీచేయకుండా వ్యవసయా చట్టాల కోసం పోరాడ ఇతే లాభం లేదు. తమ చేతుల్లో ఉన్న పనులను, బాధ్యతలను వదిలేసి మాట్లాడడం సరికాదు. ముందుగా తెలుగు రాష్ట్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిపించామని ప్రకటించుకుంటే అంతకు మించిన సమస్య ఉండదు.

## ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్ల విముఖత

ఖమ్మం,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): పక్షంరోజులుగా వైరా మండలంలో కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యాన్ని వైరా, తల్లాడ పరిసర ప్రాంతాల్లోని మిల్లర్లు దిగుమతి చేస్తున్నారు. అయితే ఈ ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు ముందుకు రావడం లేదు. తమకు ప్రభుత్వం ఇచ్చిన కేటాయింపులు, లక్ష్యాలు పూర్తయ్యాయని, అందువల్ల తాము ధాన్యాన్ని దిగుమతి చేసుకోలేమని, ఇకముందు కూడా కాంటాలు వేయవద్దని కొనుగోలు కేంద్రాలకు స్పష్టం చేశారు. దీంతో మండలంలోని వైరా, పూసలపాడు, గరికపాడు సొసైటీల పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో, డీసీఎంఎస్ పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు సరిగా జరగలేదు. ఇప్పటికే మండలంలో మూడు సొసైటీల పరిధిలో దాదాపు 35వేలక్వింటాళ్ల పైచిలుకు ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేశారు. ఈ ధాన్యాన్ని వైరా, తల్లాడ, పాలడుగు, మధిర మిల్లుల్లో దిగుమతి చేశారు.

## టీఆర్‌ఎస్ అసంతృప్తులకు బిజెపి గాలం?

### -పలువురు ఆసక్తిగా ఉన్నారంటూ ప్రచారం

కరీంనగర్,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): ఇటీవలి విజయాల ఊపుతో ఉన్న బిజెపి అధికార టిఆర్‌ఎస్‌లో అసంతృప్తులను ఆకర్షించే పనిలో పడిందని సమాచారం. స్వామిగౌడ్ లాంటి వారిని చేర్చుకున్న తరవాత అలాంటి వారు జిల్లాలో ఎవరైనా ఉన్నారా అన్నది ఆరా తీస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నేతలు కొందరు బీజేపీలోకి వెళ్లే అవకాశం ఉన్నదని, టీఆర్‌ఎస్ పార్టీలో ఇప్పుడు కాకున్నా ఎన్నికల సమయానికి ముందు కొందరు అగ్ర నేతలు బీజేపీలో చేరే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీ నాటికి ఉమ్మడి జిల్లా పరిధిలో పలు రాజకీయ సమీకరణాలు మారతాయని, ఎమ్మెల్యే టికెట్ ఆశించేవారిలో పలువురు ముందస్తుగాగాని, ఎన్నికల సమయంలోగాని బీజేపీలో చేరతారని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీలోని పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉన్న సీనియర్ నేతలు కొందరు బీజేపీలో చేరతారని చర్చించుకుంటున్నారు. మంథని, ధర్మపురి, సిరిసిల్ల నియోజకవర్గాల పరిధిలో ఈ పరిణామాలు జరగవచ్చని అనుకుంటున్నారు. టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులతోపాటు ద్వితీయ, తృతీయశ్రేణి కార్యకర్తల్లో బీజేపీవైపు మొగ్గు చూపుతున్నవారెవరు, ఎందుకు వారు ఆ నిర్ణయం తీసుకుటున్నారు, వారి అసంతృప్తికి కారణమేమిటి అన్ని విషయాలను విచారించాలని నిఘాబృందాలకు ఆదేశించినట్లు సమాచారం. పార్టీ కేడర్‌లో అసంతృప్తి ఉంటే అందుకు కారణం స్థానిక నేతలా, స్థానిక ఎమ్మెల్యేలా, లేనిచో అగ్రనాయకత్వం విధానాలా అన్న విషయాన్ని పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారని తెలిసింది.

## ఎంపిని దూషించిన ఘటనలో కేసు

అమరావతి,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): అమరావతి రైతులపై మరోసారి ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద గుంటూరు జిల్లా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎంపీ నందిగం సురేష్‌ను కులం పేరుతో దూషించారని ఓ కేసులో ఉద్దండరాయని పాలెంకు చెందిన 20 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు అయ్యాయి. అలాగే మూడు రాజధానుల మద్దతుదారులను దూషించారని అదే గ్రామానికి చెందిన మరో నలుగురిపైనా ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారు. మూడు రాజధానుల మద్దతుదారులు తమ శిబిరంపై దాడి చేశారని అమరావతి రైతులు వారిపై ఇప్పటికే పిర్యాదు చేయగా..దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్న విషయం తెలిసిందే.

## నేడు జాతీయ లోక్ అదాలత్

### సద్వినియోగం చేసుకోవాలన్న సబ్‌జడ్జి

ఆదిలాబాద్,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలో ఈ నెల 12న శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించ నున్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని, కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా సబ్ జడ్జి ఉదయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణ రా ష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ హైదరాబాద్ , జిల్లా ప్రధా న న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మ న్ జస్టిస్ బీఎస్ జగ్జీవన్ కుమార్ ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొవిడ్ 19 మార్గదర్శకాల ప్రకారం లోక్ అదాలత్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ లోక్ అదాలత్ లో క్రిమినల్, ఎక్సైజ్ కేసులు, సివిల్ కేసులు, నెగోషియబుల్ యాక్ట్ కేసులు, కుటుంబ విషయాలు, మో టార్ వాహన ప్రమాదాలకు సంబంధించిన కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులు ఆయా అధికార పరిధిలోని న్యాయస్థానాలకు హాజరుకావచ్చని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కంపౌండింగ్ కేసులు పరిష్కరించడానికి వేదికగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జేపీ నడ్డా కాన్వాయ్ దాడిపై విచారణకు ఆదేశించిన అమిత్ షా

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా కాన్వాయ్‌పై పశ్చిమ బెంగాల్లో జరిగిన దాడిని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఖండించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుంచి కూడా 12 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. 2021లో పశ్చిమ బెంగాల్లో ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో బీజేపిని ఎన్నికల కోసం సన్నద్ధం చేసేందుకు జేపీ నడ్డా బెంగాల్లో పర్యటిస్తున్నారు. బెంగాల్ రాజధాని కోల్‌కతాకు 50 కిలోమీటర్ల దూరంలో జేపీ నడ్డా ప్రయాణిస్తున్న వాహన కాన్వాయ్ మీద దాడి జరిగింది. బెంగాల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ దాడి చేశారని బీజేపీ ఆరోపించింది. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న డైమండ్ హార్బర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలను కలిసేందుకు వెళ్తున్న సమయంలో జేపీ నడ్డా కాన్వాయ్ మీద దాడి జరిగింది. ఈ దాడిలో బీజేపీ నేత ముకుల్ రాయ్‌కు గాయాలు అయ్యాయి. రాళ్లతో దాడి చేయడంతో కారు అద్దాలు కూడా ధ్వంసం అయ్యాయి. 'ఈ రోజు బెంగాల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మీద జరిగిన దాడి ఆక్షేపణీయం. దీన్ని ఎంత ఖండించినా తక్కువే. కేంద్ర ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుంది. బెంగాల్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడికి రాష్ట్రంలోని శాంతిప్రియులు సమాధానం చెప్పాలి.' అని అమిత్ షా ట్వీట్ చేశారు.జేపీ నడ్డా ప్రయాణిస్తున్నకారు బుల్లెట్ ప్రూఫ్ కావడంతో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. మరో కారులో ఉన్న బీజేపీ నేత కైలాష్ విజయవర్గీయ గాయపడ్డారు . 'దుర్గా మాత దయ వల్లే నేను మీటింగ్ ప్రదేశానికి రాగలిగాను.' అని జేపీ నడ్డా అన్నారు. నడ్డా కాన్వాయ్ మీద జరిగిన దాడిని నిరసిస్తూ బీజేపీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది.

# బిజెపి దూకుడుపై టీఆర్‌ఎస్ సీరియస్

### పార్టీలో మొదలైన అంతర్గత విశ్లేషణ
### మంచీ చెడులపై నేతల ఆత్మపరిశీలన?

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): దుబ్బాక ఉప ఎన్నిక ఫలితం..గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ఫలితాల తరవాత మరిన్ని ఎన్నికలు రాబోతున్నాయి. వరంగల్,ఖమ్మం కార్పోరేషన్లకు త్వరలోనే ఎన్నికలు రానున్నాయి. ఆ తరవాత సిద్దిపేట మున్సిపాలిటీ కూడా ఎన్నికలకు పోవాల్సి ఉంది. మరో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా ఉన్నాయి. ఇవన్నీ కూడా అధికార టిఆర్‌ఎస్‌కు సవాల్ లాంటివే. బిజెపి విసిరన సవాల్‌తో అధికార టిఆర్‌ఎస్ ఆత్మవిమర్శ చేసుకుని ముందుకు సాగుతుందా లేదా అన్నది ముమ్ముందు అనుసరించే వ్యూహాన్ని బట్టి ఉంటుంది. ఇకపోతే ఇటీవల పలువురు ఎమ్మెల్యేలు, ఓ మంత్రిపై వచ్చిన భూ కబ్జాల వ్యవహారం కూడా అధికార టిఆర్‌ఎస్ ప్రతిష్టకు మచ్చగా నిలవనుంది. ఈ ఆరోపణలపై ప్రభుత్వం లేదా పార్టీ స్పందించలేదు.

ఇవన్నీ కూడా ప్రజలు గమనిస్తున్నారు. అధికార పార్టీలో అంతర్మ ధనం మొదలయితే తప్ప... అంతా బాగానే ఉంది అన్న ధీమా సడలి ఆత్మ పరిశీలన చేసుకోవడానికి సిద్ధం కావాలి. అయితే ఆత్మపరిశీలన చేసుకుంటామని గతంలోనే మంత్రి కెటిఆర్ ప్రకటించారు. ఇందులో భాగంగా గ్రేటర్ ఎన్నికల్లో పార్టీ ఊహించిన విధంగా ఫలితాలు రాకపోవడానికి గల కారణాలను అన్వేషి స్తున్నారు. ప్రభుత్వం, టీఆర్‌ఎస్‌పై ఉన్న అనుకూలతలను మాత్రమే కాకుండా ప్రజల్లో వ్యతిరేక భావనలు వ్యక్తమైనా ఉన్నది ఉన్నట్లుగా రిపోర్టు చేయాలని టీఆర్‌ఎస్ అధినేత ఆదేశించారని చెబుతున్నారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తనపై, తన ప్రభుత్వంపై, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించడం ఇదే మొదటిసారి కావడం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని, ప్రతి నేత బలం, బలహీనతల గురించి, మంచి చెడుల గురించి సమాచారం సేకరించడంతో పార్టీని పునాదుల నుంచి పటిష్టపర్చుకునే దిశగా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిసారించారని అంటున్నారు.

మొత్తానికి దుబ్బాక ఉప ఎన్నిక, గ్రేటర్ ఎన్నికలు టీఆర్‌ఎస్ పార్టీకి ఇచ్చిన కుదుపు ఆ పార్టీలో పెద్ద చర్చకే తెరతీశాయి. పనిలోపనిగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పై ప్రజల్లో ఉన్న అభిప్రాయం, పథకాలపై, నాయకులపై ఉన్న విశ్వాసం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని సేకరించేందుకు నిఘాబృందాలను పురమాయించిందని సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని జిల్లాల్లోనూ క్షేత్రస్థాయిలో ఈ పరిశీలన జరిపి ఉన్నది ఉన్నట్లుగా నివేదిక సమర్పించాలని ఇంటలిజెన్స్ వర్గాలను ఆదేశించినట్లు తెలుస్తున్నది. దుబ్బాక ఉప ఎన్నిక, గ్రేటర్ ఎన్నికల్లో అనూహ్య విజయాన్ని సాధించి ఈ రెండు చోట్ల టీఆర్‌ఎస్‌తో నువ్వా నేనా అన్నట్లు ఓట్లను సాధించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తి తామేనని సవాల్ విసిరింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆ పార్టీకి చెందిన నేతలు ప్రకటిస్తున్న నేపథ్యంలో పరాజయం రుచి చూసిన టీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం అప్రమత్తమయింది. భారతీయ జనతా పార్టీకి అనూహ్య విజయాలు అందిరావడంతో ఆ పార్టీవైపు పలువురు నేతలు దృష్టిసారించారని వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఆ పార్టీ అగ్రనాయకత్వం కూడా అధికార టీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్, తదితర పార్టీల్లో ప్రజాబలం, క్షేత్రస్థాయిలో పట్టు, నాయకత్వ పటిమ ఉన్న నేతలపై ఆకర్ష్ వల విసురుతున్నదని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఏయే పార్టీ నేతలు ఎవరెవరు బీజేపీలో చేరుతారు అన్న విషయంలో జోరుగా చర్చ సాగుతున్నది. అన్ని ప్రాంతాల్లో అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల గురించి ప్రజలమేనుకుంట్నురు, ప్రజల్లో ఎవరికి మంచి పేరు ఉన్నది, ప్రజలకు అందుబాటులో ఉంటున్నవారెవరు, వారి నడవడి, ఇతరత్రా విషయాల పట్ల ప్రజలవేనుకుంటున్నారు, ప్రజల్లో అభిమానం ఉన్న నాయకులెవరు అన్న విషయాలను కూడా సేకరించాలని, అన్ని పార్టీల నేతల బలాలు, బలహీనతలు తెలుసుకొని సమాచారాన్ని సమర్పించాలని నిఘా బృందాలకు సూచించినట్లు సమాచారం. అలాగే వివిధ పథకాల అమలు, ప్రజల్లో వాటిపట్ల ఉన్న అభిప్రాయం, వారి నుంచి ఇంకా ఏమైనా సూచనలుంటే సేకరించి పంపాలని నిఘాబృందాలకు సూచించారని తెలిసింది.

# కవిత కోసం కేబినేట్ విస్తరణ జరిగేనా ?

### జరిగితే ఎవరు ఉంటారు..ఎవరు ఊడుతారు?.
### టీఆర్‌ఎస్‌లో మళ్లీ మొదలైన కేబినేట్ చర్చ

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని మరోమారు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఎమ్మెల్సీ కవితను కేబినేట్‌లోకి తీసుకోవడం ఖాయమని టిఆర్‌ఎస్ నేతలు అంటున్నారు. రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నా కేబినేట్లో కవితకు మాత్రం చోటు దక్కనుందని అంటున్నారు. అయితే ఆమెను తీసుకోవాలంటే ఎవరో ఒకరిని తప్పించాలి. అలాగే కూతురి కోసమే కేబినేట్ విస్తరణ జరిగితే విమర్శలు వస్తాయి. అందువల్ల మంత్రుల పనితీరు కారణంగా ఒకరిద్దరిని తప్పించే కసరత్తు సాగుతోందని కూడా సమాచారం. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన నాటి నుంచి కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలకు టెన్షన్ పట్టుకుందని సామాచారం.. తాము ఇంఛార్జులుగా ఉన్న డివిజన్లలో పార్టీ ఓటమే ఈ ఆందోళనకు కారణమని చెబుతున్నారు. అలా విఫలమయిన వారిని తప్పిస్తే తప్ప కొత్తవారికి ఛాన్స్ రాదు. అలాగే కవిత కూడా ముషీరాబాద్‌లో ఫెయిల్ అయ్యారు. అయినా ఆమెకు మినహాయింపు ఉంది. మినహాయింపు లేనిదల్లా మంత్రులకే. దుబ్బాక ఓటమి తర్వాత నిర్వహించిన గ్రేటర్ ఎన్నికల్లో అధికార టీఆర్‌ఎస్ బాగా దెబ్బతింది. ఇక్కడా బిజెపి బలం పుంజుకుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులను డివిజన్లకు ఇంఛార్జులుగా నియమించినా పలుచోట్ల ఓటమి తప్పలేదు. ఒక్కో మంత్రికి ఒక్కో డివిజన్ కేటాయించినా పటులచోట్ల మంత్రుల వ్యూహాలు పనిచేయలేదు. డివిజన్లకు ఇంఛార్జులుగా ఉన్న చోట 9 మంది మంత్రులు సక్సెస్ అయితే.. నలుగురు మాత్రం పార్టీని విజయతీరాలకు చేర్చలేకపోయారు. దీంతో వారి రాజకీయ భవిష్యత్‌పై పార్టీలో రకరకాలుగా చర్చ జరుగుతోంది. తెలంగాణలో టీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయింది. కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఉంటాయని అనుకుంటున్నారు. ఇప్పుడు ఎన్నికల ఫలితాలను ప్రామాణికంగా తీసుకుని నిర్ణయం చేపడితే మాత్రం ఇబ్బంది తప్పదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇలాంటి తరుణంలో పార్టీలోనూ.. ప్రభుత్వంలోను మార్పులు చేర్పులు చేయాలని సీఎం కేసీఆర్ భావిస్తే కొందరి రాజకీయ భవిష్యత్ ఏంటన్న చర్చ జరుగుతోంది. అందుకే గ్రేటర్‌లో టీఆర్‌ఎస్ గెలుపుకోసం పనిచేసి...ఫలితాల తర్వాత కంగుతిన్న నాయకుల్లో టెన్షన్ మొదలైందని సమాచారం. ఆయా డివిజన్లలో టీఆర్‌ఎస్ గెలుపుకోసం మంత్రులు సర్వ శక్తులు ఒడ్డారు. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు అప్పగించారు. ఆ డివిజన్‌లో అసంతృప్తులను బుజ్జగించడంలో సక్సెస్ కావడంతో అంతా అనుకూలంగానే ఉంటుందని మంత్రి భావించారు. కానీ.. అడిక్‌మెట్‌లో బీజేపీ అభ్యర్థి గెలవడంతో శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు అధికార పార్టీ నాయకులు కంగుతిన్నారు. మరో మంత్రి జగదీష్‌రెడ్డికి సరూర్‌నగర్ డివిజన్ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి పోలింగ్ ముందు రోజు వరకు సరూర్‌నగర్‌లోనే మకాం వేసుకుని పగలు రాత్రి ప్రచారం చేశారు. పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు అందరినీ సమన్వయ పరిచారు. కానీ.. ఈ డివిజన్‌లో మంత్రి పాచికలు పారలేదు. టీఆర్‌ఎస్ అభ్యర్థి ఓడి.. బీజేపీ క్యాండిడేట్ గెలిచారు. హిమాయత్ నగర్ ఇంఛార్జ్ మంత్రి గంగులకు బీజేపీ షాక్ ఇచ్చింది. మల్కాజ్‌గిరి డివిజన్ ఇంఛార్జ్‌గా మంత్రి ఈటల రాజేందర్‌కు బాధ్యతలు అప్పగించింది టీఆర్‌ఎస్. ఆయన కూడా తన నియోజకవర్గం నుంచి అనుచరులను దించారు. హోరాహోరీ పోరులో ఇక్కడ బీజేపీ గెలిచింది. అలాగే హిమాయత్‌నగర్ డివిజన్ బాధ్యతలను మంత్రి గంగుల కమలాకర్‌కు ఇచ్చారు టీఆర్‌ఎస్ పెద్దలు. పార్టీ అభ్యర్థి కంటే ముందుగానే ప్రతిరోజు రో÷-డడెక్కి ప్రచారం చేశారు కమలాకర్. కానీ.. ఇక్కడ సిట్టింగ్ కార్పొరేటర్ ఓడి.. బీజేపీ అభ్యర్థి గెలిచారు. ఇలాంటి ప్రాంతాల్లో మంత్రుల పసనితనాన్ని బట్టి మార్పులు ఉంటాయన్నది ప్రచారం జరగుతోంది. అలా జరిగితే ఎవరు ఉంటారు..ఎవరు ఊడుతారన్నది కెసిఆర్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.

# త్వరలో నీట్ 2021

### రద్దు ఆలోచనే లేదు
### పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం
### విద్యార్థులకు మరింత సమయం కల్పిస్తాం
### కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ):బోర్డు, నీట్, జేఈఈ పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ ఇవాళ వెబ్ నార్ ను ఏర్పాటు చేశారు. ఈ సమయంలో ఒక విద్యార్థి ఈ ఏడాది నీట్ 2021 పరీక్షను ఆన్ లైన్ విధానంలో లేదా ఆఫ్ లైన్ విధానంలో నిర్వహిస్తారా అని అడిగాడు. దీనిపై విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ.. 'ఇప్పటివరకు ఆఫ్ లైన్ విధానంలో నీట్ పరీక్ష నిర్వహించాం, అయితే జేఈఈ పరీక్షను ఆన్ లైన్ లోనే చేశాం' అని తెలిపారు. నీట్ లో ఆన్ లైన్ లో చేయలేదని, కానీ మీ సూచన మేరకు విద్యార్థులు ఆన్ లైన్ లో లేదా ఆఫ్ లైన్ లో నీట్ పరీక్ష రాయాలనుకుంటున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా నే నిర్ణయం ఉంటుంది' అని ఆయన అన్నారు. నీట్ పరీక్షను వాయిదా వేయడం లేదా రద్దు చేసే అంశంపై రమేష్ పోఖ్రియాల్ మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నీట్ పరీక్ష తేదీలను వాయిదా వేయడాన్ని అర్థం చేసుకోవాలి. అందుకే గత నీట్ పరీక్ష తేదీలో మూడు మార్పులు చేశాం. పరీక్షల కోసం కేంద్రాలను పెంచామని, 99 శాతం మంది విద్యార్థులకు వారి ఇష్టాఇష్టాలకు అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేశాం. “నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) త్వరలో అధికారిక వెబ్ సైట్ లో %ఱఱవవ్.అఱఎ% లో నమోదు, అడ్మిట్ కార్డు మరియు నీట్ పరీక్ష ఫలితాల కు నోటిఫికేషన్ విడుదల చేయవచ్చు.

## కొత్తగూడెం సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో పెద్దపులి

భద్రాద్రి కొత్తగూడెం ,డిసెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో పెద్దపులి తిరుగుతోందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మండలంలోని ప్రభాత్ నగర్, ఆయిల్ పాం సమీప ప్రాంతాల్లో పులి పాద ముద్రలను స్థానికులు చూసి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో కిన్నెరసాని వైల్డ్ లైఫ్ అధికారులు ఆ ప్రాంతాలను పరిశీలించారు. ఆ పాదముద్రలు పులివేనని నిర్ధారించి, నమూనాలను సేకరించారు. 'ఈ ప్రాంతంలో పులి సంచించినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. అటవీప్రాంతాల్లో ఒంటరిగా తిరగొద్దు. అవసరమైతే గుంపులుగా వెళ్లాలి. ట్రాక్టర్ హారన్ ను పదే, పదే మోగించకూడదు' అని అధికారులు సూచించారు. 'ఆ పులి గర్భంతో ఉండవచ్చు. సురక్షిత ప్రాంతం కోసం తిరుగుతున్నట్లున్నది. అడవులకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి' అని హెచ్చరించారు.

## చట్టాలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతోంది

### రైతులను కష్టాల పాలుజేస్తున్నది
### వెంటనే చట్టాలను రద్దు చేయాలి
### సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణల బిల్లును వెనక్కు తీసుకోవాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. రైతు ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది. రైతులకు ఎంతో కొంత అండగా ఉన్న చట్టాలను కార్పొరేట్లకు తాకట్టు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తూ, కొత్తగా మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చి రైతులను కష్టాల పాలుజేస్తున్నది. ఈ చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఢిల్లీలో గత 14 రోజులగా ఎముకలు కొరికే చలిలో కూడా వేలాది మంది రైతులు ఆందోళనలు చేస్తున్నా, కేంద్రం వారిని పట్టించుకోకుండా రైతు నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ఈ రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా దేశంయావత్ ఒక్కతాటిపైకి వచ్చి పెద్ద ఎత్తున పాల్గొని దేశ వ్యాపిత బంద్‌ను జయప్రదం చేసింది. ఐక్య రాజ్యసమితి మరియు కెనడా అధ్యక్షుల మద్దతు లభించడంతో పాటు, లండన్ తదితర దేశాల్లోని భారత ప్రజలు రైతులకు అండగా నిరసనలు తెలియజేస్తున్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం మాత్రం తన అహంకార ధోరణితో ముందుకు పోతూ, మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నది. ఈ తరుణంలో తప్పని పరిస్థితుల్లో రైతు సంఘాలు తమ ఉద్యమాన్ని ఉధతం చేయాలని నిర్ణయించాయి. దీనిలో భాగంగా ఈ నెల 14 నుండి పెద్ద ఎత్తున రెరడవదశ ఆందోళనలు నిర్వహించాలని, దేశీయ కార్పొరేట్ల దిగ్గజాలైన రిలయన్స్, ఆదాని గ్రూపుల ఉత్పత్తులను, మార్టులను బహిష్కరించాలనే రైతు సంఘాల పిలుపులను సీపీఐ(ఎం) బలపరుస్తూ, 14న జరిగే నిరసన ప్రదర్శనల్లో పార్టీ శ్రేణులు, యంత్రాంగం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడాలని, రైతులకు నష్టదాయకమైన మూడు వ్యవసాయ బిల్లులతో పాటు, విద్యుత్ సంస్కరణల బిల్లును రద్దు చేయాలని, రైతు నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నది.

## ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు

### కేసులు తగ్గుముఖం పడుతున్నాయి
### నీటిట్యాంకులను క్లోరినేషన్ చేస్తున్నాం
### ఏలూరు బాధితుల్ని పరామర్శించిన మంత్రి ఆళ్ల నాని

విజయవాడ,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): ఏలూరు బాధితులను మంత్రి ఆళ్లనాని పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి మంత్రి తెలుసు కున్నారు. వింత వ్యాధికి సంబంధించి రీసెర్చ్ సంస్థలన్నీ శాంపిల్స్ సేకరించాయని, బాధితుల్లో సీసం రక్తం, నికెల్ ఎక్కువగా ఉన్నట్లు రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి పూర్తి స్థాయి నివేదిక వస్తుందని ఆళ్ల నాని పేర్కొన్నారు. మరోవైపు ఏలూరులో వింత వ్యాధి కేసులు తగ్గుముఖం పట్టాయి. బుధవారం రాత్రి నుంచి కొత్త కేసులు నమోదు కాలేదు. ఇప్పటివరకు మొత్తం 592 కేసులు నమోదయ్యాయి. వ్యాధి నుంచి కోలుకుని 511 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఏలూరు వాసులకు వింత రోగం సష్టించిన భయం అంతా ఇంతా కాదు. ఇప్పుడు ఏం తాగాలన్నా.. తినాలన్నా ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తున్నారు. వణికిస్తున్న ఈ వ్యాధిని గుర్తించి, ఎప్పుడు అంతం చేస్తారోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

## నడ్డాపై దాడి వెనక హత్యకు కుట్ర

### తృణమూల్ పనేనన్న కేంద్ర మంత్రులు
### దాడిని తీవ్రంగా ఖండించిన బండి సంజయ్

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ): పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై జరిగిన దాడిని కేంద్ర మంత్రులు తీవ్రంగా ఖండించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) నేతల ఆధ్వర్యంలోనే దాడి జరిగిందని కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, నరేంద్రసింగ్ తోమర్ ఆరోపించారు. టీఎంసీ నేతలు జేపీ నడ్డాను చంపాలని ప్రయత్నించారని, బు÷-లలెట్ ప్రూఫ్ కారు ఉంది కాబట్టే ఆయన బతికి బయట పడ్డారన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపించి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, రెండు రోజుల పర్యటన నిమిత్తం పశ్చిమ బెంగాల్‌లో పర్యటిస్తున్ననడ్డా, కైలాష్ విజయవర్గియా గురువారం డైమండ్ హార్బర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ సమయంలో టీఎంసీ కార్యకర్తలు రోడ్డుకు ఇరువైపులా నిల్చుని బీజేపీ వ్యతిరేక నినాదాలు చేయడమే కాక రోడ్డు బ్లాక్ చేయడానికి ప్రయత్నించారు. అంతటితో ఊరుకోక నడ్డా ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు.జేపీ నడ్డాపై దాడిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. ఒక జాతీయ పార్టీ అధ్యక్షు, కేంద్రంలో అధికారంలో పార్టీకి సారధి అయిన నడ్డా కాన్వాయిపై రాళ్లు రువ్వడం పశ్చిం బెంగాల్‌లో శాంతిభద్రతు ఎంత అధ్వాన్నంగా ఉన్నయో రుజువు చేస్తోందని విమర్శించారు. బెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్, జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టు కలిసి బీజేపీ పైన ఇటువంటి దాడులు నిర్వహించి కార్యకర్తలను చిత్రహింసకు గురిచేయడం, హత్య చేయడం ఇటీవల కాలంలో పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు బీజేపీ కార్యకర్తలు బయపడరని పేర్కొన్నారు.

## రైల్వేను స్తంభింపజేస్తాం

### దేశవ్యాప్తంగా రైల్వే ట్రాక్‌లను బ్లాక్ చేస్తాం
### రైతు సంఘాల నేతలు హెచ్చరిక

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్‌ఎన్‌ఎ):వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా రైల్వే ట్రాక్‌లను బ్లాక్ చేస్తామని రైతు సంఘాల నేతలు హెచ్చరించారు. కేంద్రానికి గురువారం వరకు అల్టిమేటం ఇచ్చామని, ప్రధాని మోదీ తమ మాట వినకపోతే, చట్టాలను వెనక్కి తీసుకోక పోతే రైల్వే ట్రాక్‌లను బ్లాక్ చేస్తామని రైతు నాయకుడు బూటా సింగ్ తెలిపారు. కేవలం పంజాబ్‌లో మాత్రమేగాక రైతులంతా దేశవ్యాప్తంగా రైలు పట్టాల వద్ద నిరసన తెలుపుతారని అన్నారు. గురువారం నాటి సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. దీనిపై సంయుక్త్ కిసాన్ మంచ్ ఒక తేదీని నిర్ణయించి ప్రకటిస్తుందని తెలిపారు. ఈ నెల 12న టోల్ గేట్లను అడ్డుకుంటామని, డీసీ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామని రైతు నేతలు చెప్పారు. జోధ్‌పూర్-ఢిల్లీ రహదారిని అడ్డుకుంటామన్నారు. వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటే కేంద్రానికి వచ్చే నష్టం ఏమిటని రైతు నేతలు ప్రశ్నించారు. వ్యాపారుల కోసం చట్టాలు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని భారతీయ కిసాన్ యూనియన్ (ఆర్) నేత బల్బీర్ సింగ్ రాజేవాల్ తెలిపారు. వ్యవసాయం రాష్ట్ర పరిధిలోనిదని, దానికి సంబంధించిన చట్టాలు చేసే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ పోలీసింగ్

### మర్కూక్‌లో అత్యాధునిక పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): అత్యాధునిక, సాంకేతిక సేవలను ఉపయోగించడంలో దేశానికే రాష్ట్రం రోల్ మోడల్‌గా నిలిచిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆరేండ్లలోనే తెలంగాణ పోలీసింగ్ జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని చెప్పారు.

పోలీసుల మెరుగైన సేవల వల్లే హైదరాబాద్‌తోపాటు పలు స్టేషన్లకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని చెప్పారు. సిద్దిపేట జిల్లాలోని మర్కుక్‌లో ఆధునిక హంగులతో నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్‌ను హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటైన వెంటనే సీఎం కేసీఆర్ అభివృద్ధి, పోలీస్ వ్యవస్థపై దృష్టిపెట్టారని చెప్పారు. షీటీమ్స్, సీసీ కెమెరాలు, ఆన్‌లైన్ వ్యవస్థ, సాంకేతిక సేవలతో రాష్ట్రం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని వెల్లడించారు. ఇక్కడ అమలుచేస్తున్న పోలీస్ సేవలు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని కేంద్రమే చెప్పడం సీఎం కేసీఆర్ పనితీరుకు నిదర్శనమన్నారు. బాధితులకు సత్వరన్యాయం జరిగేందుకు సీఎ కేసీఆర్ పోలీసింగ్ వ్యవస్థను తీర్చిదిద్దారని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉండటం వల్లే అవెజాన్ వంటి సంస్థలొచ్చాయన్నారు. దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. మర్కుక్‌లో ఆధునిక హంగులతో కార్పొరేట్ ఆఫీస్ స్థాయిలో ఈ పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. దీని నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం రూ.14.96 కోట్లు వెచ్చించింది. ఇందులో ఆధునిక సదుపాయాలు, సిబ్బందికి నివాస సముదాయం, అతిథిగృహం ఉన్నాయి. సిబ్బంది కోసం ప్రత్యేకంగా జిమ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మర్కూర్ మండలంలోని అన్ని గ్రామాలను సీసీ కెమెరాలతో అనుసంధానం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ మహేందర్ రెడ్డి, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, సిద్దిపేట సీపీ జోయల్ డేవిస్, జెడ్పీ చైర్పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు.




# పేలిపోయిన అమెరికా స్పేస్ ఎక్స్ రాకెట్

వాషింగ్టన్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): అంగారక గ్రహంపైకి మనుషులను తీసుకెళ్లడానికి రూపొందించిన స్పేస్ ఎక్స్ నమూనా రాకెట్ ల్యాండింగ్ అవుతూ పేలిపోయింది. మనుషులను అంతరిక్షంలోకి పంపే విషయంలో అమెరికాకు చెందిన బిలియనీర్ ఎలన్ మస్క్ సంస్థ స్పేస్ ఎక్స్ ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల తాను రూపొందించిన రాకెట్ లో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపింది కూడా. ఈ నేపథ్యంలో మార్స్ మిషన్ ప్రయత్నాలు ప్రారంభించిన ఆ సంస్థ.. 16 అంతస్థుల పొడవుండే హెవీ లిఫ్ట్ రాకెట్ స్టార్ షిప్ ను తాజాగా ప్రయోగించింది. టెస్ట్ లాంచ్ ప్రారంభమైన తర్వాత స్టార్ షిప్ కక్ష్య లోకి వెళ్లింది. నింగిలోకి వెళ్లిన తర్వాత ఒకదాని వెనుక మరొకటి మూడు ఇంజిన్లు పని చేశాయి. అయితే, 4 నిమిషాల 45 సెకన్ల తర్వాత మూడో ఇంజిన్ ఆరిపోయింది. అక్కడ నుంచి దానిని భూమిపై ల్యాండ్ చేసే క్రమంలో మొదటి రెరదు ఇంజిన్లను మళ్లీ స్టార్ట్ చేశారు. కానీ ల్యాండింగ్ సమయంలో వేగాన్ని నియంత్రించడంలో విఫలం కావడంతో క్రాష్ ల్యాండింగ్ అయింది. అయితే, స్టార్ షిప్ పేలిపోయినా.. పలు అంశాల్లో కీలకమైన వివరాలు లభించినట్టు ఎలన్ మస్క్ తెలిపారు.

# చడ్డా, నడ్డా, ఫడ్డా, భడ్డా.. వస్తుంటారు పోతుంటారు

### బీజేపీకి ఇంకో పనేం లేదు
### నిజానికి వారి సభల్లో జనాలే ఉండరు
### కార్యకర్తలు చేసే హడావుడి చాలా ఎక్కువ
### నడ్డాపై మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో మండిపాటు

కోల్‌కతా,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోకి ఎవరెవరో నాయకులు వస్తున్నారు. వారి సభలకు జనాలు రారు కానీ, వాళ్ల కార్యకర్తలు చేసే హడావుడి చాలా ఎక్కువగా ఉంటుంది. ఒకరు వచ్చిపోగానే ఇంకొకరు వచ్చి వెళ్తుంటారు. చడ్డా, నడ్డా, ఫడ్డా, భడ్డా.. ఇట్లా ఎవరెవరో వస్తున్నారంటూ తనదైన శైలిలో మమతా బెనర్జీ సెటైర్లు గుప్పించారు. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు కోల్‌కతా వచ్చి వెళ్లిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో బీజేపీపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. "వారికి (బీజేపీ) ఇంకో పనేం లేదు. ఒకసారి హూంమంత్రి ఇక్కడికి వస్తారు. ఆ వెంటనే చడ్డా, నడ్డా, ఫడ్డా, భడ్డా.. ఇట్లా ఎవరెవరో వస్తుంటారు, పోతుంటారు. నిజానికి వారి సభల్లో జనాలే ఉండరు. కానీ ఆ పార్టీ కార్యకర్తలు చేసే హడావుడి చాలా ఎక్కువగా ఉంటుంది' అని మమతా బెజర్జీ అన్నారు. కాగా, గురువారం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. నడ్డా కాన్వాయ్ తో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కైలాస్ విజయ వర్గీయ వాహనంపై కూడా ప్రత్యర్థులు రాళ్ల దాడికి దిగారు. కోల్‌కతాలోని డైమండ్ హార్బర్ ప్రాంతంలో పర్యటిస్తున్న సందర్భంలో ఈ దాడి జరిగిందని రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ప్రకటించారు.

# చట్టాలు పూర్తిగా లోప భూయిష్టం కాదు

### అగ్రి చట్టాల్లో లోపాలు లేవు
### చట్టాలను పూర్తిగా వెనక్కి తీసుకోలేం
### ప్రతిపాదించిన సవరణలపై చర్చలకు ప్రభుత్వం సిద్ధం
### కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): రైతులకు లబ్ధి కోసం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలు పూర్తిగా లోపభూయిష్టం కాదని, చట్టాల్లో ఎలాంటి లోపాలు లేవని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అన్నారు. చట్టాలను పూర్తిగా వెనక్కి తీసుకోలేమన్న ఆయన, ప్రతిపాదించిన సవరణలపై రైతు నేతలతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, తాము పంపిన ప్రతిపాదనలను రైతు నేతలు పరిశీలించి సంబంధిత సవరణలపై చర్చల కోసం తేదీని ఖరారు చేయాలని సూచించారు. కొత్త చట్టాల వల్ల ఏపీఎంసీ యాక్ట్, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)పై ఎలాంటి ప్రభావం ఉండదని మరోసారి పునరుద్ఘాటించారు. వీటిపై లిఖిత పూర్వకంగా భరోసా ఇస్తామని చెప్పారు. అలాగే చట్టంలో పేర్కొన్న కొన్ని అంశాలపై రైతుల్లో నెలకొన్న భయాలను తొలగించే ప్రయత్నం చేశారు. రైతుల పొలాలను పారిశ్రామికవేత్తలు ఆక్రమిస్తారన్న అపోహ సరికాదని తోమర్ తెలిపారు. రైతుల భూములను లీజుకు తీసుకోవడం లేదా ఒప్పందం కుదుర్చుకోవడం వంటి నిబంధన చట్టంలో లేదన్నారు. గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో చాలా ఏండ్లుగా కాంట్రాక్ట్ వ్యవసాయం జరుగుతున్నదని, ఎక్కడా కూడా రైతుల భూములు కాంట్రాక్టర్లపరం కాలేదని తోమర్ వివరించారు. కొన్ని పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ కోసం రైతులు, ప్రాసెసర్ మధ్య ఒప్పందం కుదిరిన సందర్భంలో చేపట్టిన మౌలిక సదుపాయాలను ఒప్పందం ముగిసిన తర్వాత తొలగించాలని చట్టంలో ఉన్నదన్నారు. ఒకవేళ వాటిని తొలగించని పక్షంలో ఒప్పందం ముగిసిన తర్వాత అవి రైతులకే చెందుతాయని చెప్పారు. చట్టంలో దీని గురించి స్పష్టంగా ఉందన్నారు. మరోవైపు వ్యవసాయ ఉత్పత్తులను ప్రైవేట్ మార్కెట్లలోనే విక్రయించాలంటూ రైతులను బలవంతం చేస్తారన్న భయాందోళనలు వద్దని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఇది పూర్తిగా తప్పుడు ప్రచారమని, వ్యవసాయ చట్టాల్లో అలాంటి నిబంధన ఏదీ లేదన్నారు.

# అనుకున్నదంతా అయ్యింది..!

### మిత్రపక్ష పోరుకు.... ప్రజా నాయకుడి ఘాటైన సమాధానం
### నాడు పంతంతో రమ్మన్నారు..!




రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 11 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ పాలకవర్గం విషయంలో మున్సిపల్ ప్రజలు అనుకున్నదంతా అయింది. మిత్రపక్షమే ప్రతిపక్ష నాయకుల్లా తమ స్వార్థం కోసం విభేదాలను సృష్టిస్తూ, పొమ్మనలేక పొగబెట్టిన చందాన తీరుతో ఓ ప్రజా నాయకుడు ఘాటైన సమాధానాన్ని చెప్పాడు. ఈ సమాధానంతో ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకం నీరుగారుతుందని ఊహించలేకపోయాడు. ఇంతకీ అందరూ ఊహించిందేమిటి..? మిత్ర పక్ష పోరుకు చెప్పిన ఘాటైన సమాధానం ఏమిటో తెలుసా..! రాజీనామా.

వేములవాడ మున్సిపల్ పాలకవర్గంలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లైన రామ తీర్థపు మాదేవి, రాజేందర్ శర్మలు చైర్ పర్సన్ గా, వైస్ చైర్ పర్సన్ గా ఎన్నికైన నా విషయం అందరికి తెలిసిందే. అయితే వీరిలో వైస్ చైర్మన్ గా ఎన్నికైన మధు రాజేందర్ శర్మ మిత్రపక్ష నాయకుల పోరు పేరుతో తన కౌన్సిలర్, వైస్ చైర్మన్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తూ, ఆ పత్రాన్ని కమిషనర్ కు శుక్రవారం అందజేశారు. తాను అందజేసిన ఈ పత్రంలో మిత్రపక్ష నాయకులు కౌన్సిలర్లే ప్రతిపక్ష నాయకుడి తో చేతులు కలిపి, తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, తనకంటే ఎక్కడ మించి పోతాడో అనే కక్షతో, ఇబ్బందులకు చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ కు, ఎమ్మెల్యే రమేష్ బాబు తో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ కు పంపినట్లు మధు రాజేందర్ శర్మ తెలిపారు.

? మధు రాజేందర్ శర్మ తాను కౌన్సిలర్ గా నియామకం అయినప్పటి నుండి ఇప్పటివరకు తన వార్డులో ప్రజా సేవా, అభివృద్ధి కార్యక్రమాలను తన స్వంత ఖర్చుతో నిర్వహించి, ప్రజల ఆదరణను చూరగొన్నాడు. ఈ కార్యక్రమాల నిర్వహణ సమయంలో ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం పలకలేదని నెపంతో ఆయనపై కక్ష కట్టినట్లు వార్డులోని ప్రజలు పలువురు పేర్కొంటున్నారు. దీనిలో భాగంగానే గత నెలలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించకుండా కొందరు కౌన్సిలర్లు అతనిని అవమానించి, ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనితో తీవ్ర మనస్థాపం చెందిన ఆయన ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వార్డు ప్రజలు పేర్కొన్న విషయం విధితమే.

పంతంతో రమ్మన్నారు ..! పోరు పెట్టి పొమ్మంటున్నారు

తన వార్డులో ఉన్న బిజెపి కౌన్సిలర్ గా పోటీ చేసిన నాయకుని పై పంతంతో టిఆర్ఎస్ పార్టీలోని కొందరు నాయకులు ఈ లోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే రమేష్ బాబు సైతం ప్రజలకు తనపై ఉన్న అభిమానాన్ని చూసి కౌన్సిలర్ గా పోటీ చేసే అవకాశాన్ని పార్టీ నుండి కల్పించారు. కానీ ఇప్పుడు తను పార్టీలోకి ఆహ్వానించిన ఆ నాయకులే బిజెపి నాయకులతో పొత్తు పెట్టుకుని పొమ్మనలేక వివిధ కారణాలతో అడపదడప ఘర్షణలు పడుతూ కించపరిచేలా మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. కేవలం ఒక్క సంవత్సరంలోనే తనపై ఇంత కక్ష సాధిస్తున్న వీరితో ఇంకా నాలుగు సంవత్సరాల పాటు మర్యాద లేని చోట కలిసి ఉండి ఇబ్బందులు పడలేం అంటూ ఈ రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

# కోతకు వచ్చిన వరి ధాన్యం

### తక్కువ ధరలతో దోచేందుకు సిద్ధంగా దళారులు మద్దతు ధరల కోసం అన్నదాతల ఎదురుచూపు

అనంతపురం,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): తుంగభద్ర ఎగువ కాలువ హెచ్చెల్సీ ఆయకట్టులో సాగు చేసిన వరి కోతలు ప్రారంభమయ్యాయి. కణెకికల్లు, బొమ్మన హాళ్ మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో వరి పరిపూర్ణంగా కోత దశకు చేరింది. ఈ నేపథ్యంలో కణెకికల్లు చెరువు కింద కోతలు పది రోజులుగా చేపడుతున్నారు. 15 రోజుల్లో కోతలు తీవ్రస్థాయిలో ఉంటాయనీ, భారీగా ధాన్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొంటున్నా రు.ఆయకట్టులో సాగు చేసిన వరి దిగుబడిపై తెగుళ్లతోపాటు నివర్ తుఫాను తీవ్ర ప్రభావం చూపింది. సాధారణంగా ఖరీఫ్‌లో ఎకరాకు వరిధాన్యం దిగుబడి 40 నుంచి 50 బస్తాల దాకా వస్తుందని అంచనా. ప్రస్తుతం కోతలు చేసిన పొలాల్లో 35 బస్తాలే వచ్చింది. పంటను దోమపోటుతోపాటు అగ్గితెగులు తీవ్రస్థాయిలో ఆశించటంతో దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సారిగా వాతావరణంలో మార్పులు రావటంతో తెగుళ్లు విజృంభించాయంటున్నారు. పంట కోత దశలో ఉన్నపుడు నివర్ తుఫాను రావటంతో పూర్తిగా దెబ్బతిని, దిగుబడి తగ్గిందని అన్నదాతలు పేర్కొంటు న్నారు. ఎకరాలో రూ.25 వేల దాకా పెట్టుబడి పెట్టి, పంట సాగు చేశారు. కౌలు రైతులకు రూ.20 వేల దాకా కౌలుతోపాటు పెట్టుబడి కూడా రూ.25 వేలు వెచ్చించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కనీసం 50 బస్తాల దిగుబడి వస్తే తప్ప.. మిగులుబాటు కాని పరిస్థితి. కణెకికల్లు చెరువు కింద ఇప్పుడిప్పుడే ప్రారంభమైన వరి కోతల్లో 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు స్పష్టం చేస్తున్నారు. ఆయకట్టులో పండిన వరి ధాన్యానికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని పొలాల్లో ఆరబెట్టి, విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావట్లేదు. ప్రభుత్వం 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఏ గ్రేడ్ వరికి క్వింటాలుపై రూ.1888, బి గ్రేడ్‌కు రూ.1838 ప్రకారం మద్దతు ధర నిర్ణయించింది. ప్రస్తుతం వ్యాపారులు ధరలు నిర్ణయించలేదు. 40 వేల ఎకరాల్లో సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమైన నేపథ్యంలో డిసెంబరు, జనవరి నెలల్లో రూ.200 కోట్లకుపైగా టర్నోవర్ అయ్యే అవకాశం ఉంది. 16 లక్షల బస్తాల దాకా దిగుబడి వస్తుందని అంచనా. కనీస మద్దతు ధర రూ.1838 ప్రకారం లెక్కించినా.. రూ.200 కోట్ల దాకా టర్నోవర్ అవుతుంది. అందుబాటులో ఉండే రైస్‌మిల్లర్లు, బయటి వ్యాపారులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఈసారి సరిహద్దులోని కర్ణాటక, కర్నూలులో కూడా ఒకేసారి పంట చేతికి రావటంతో ప్రాంతీయ మార్కెటింగ్ అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత పరిస్థితిని సొమ్ము చేసుకునేందుకు దళారులు ఉపక్ర మించారు. తక్కువ ధరలో వ్యవధి కోరుతూ కొనుగోలు చేస్తామంటున్నారు. మార్కెట్ మద్దతు ధర రూ.1,838 ఉంటే రూ.1,650కి కొంటామంటున్నారు. ఆ ధరకు అమ్మితే రైతులకు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. దీంతో రైతులు వ్యవధి పెంచుకుని, దళారులకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు దళారులు ఐపీలు పెట్టి, రైతుల నోట్లో మట్టి కొట్టిన ఘటనలు చాలా ఉన్నాయి. అయినప్పటికీ గత్యంతరం లేక దళారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# మూడు రాజధానుల ముచ్చట

### ఏడాదిగా కొనసాగుతున్న రైతుల ఆందోళన పట్టువీడకుండా ముందుకు సాగుతున్న ప్రభుత్వం

అమరావతి,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): అమరావతి నుంచి రాజధానిమార్పు,పాలనా వికేంద్రీకరణపేరిట మూడు రాజధానులు ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. అలాగే రైతులు కూడా తమ ఆందోళనలను ఉధృతం చేస్తున్నాయి. దాదాపు ఏడాదిగా ఆయా గ్రామాల ప్రజలు, రైతులు అమరావతి కోసం ఉద్యమిస్తున్నారు. ఉన్నచోట రాజధాని కొనసాగనీయకుండా ప్రభుత్వం మూడురాజధానుల ఆటను ఆడుతోంది. అయితే మూడు రాజధానులన్న దృక్పథం ఎక్కడా లేదు కదా అనేది ప్రభుత్వ వాదనపై ప్రధాన ప్రశ్నగా మారింది. అహ్మదాబాద్ గాంధీనగర్, రాయ్‌పూర్ నయారాయ్‌పూర్ అన్నప్పుడు ఆ ప్రభుత్వాలు వున్నచోటకు దగ్గర్లో లేదంటే నిర్దిష్టమైన ప్రదేశానికి తరలించారరు. కాని మూడు రాజధానులనే భావనకు ఎక్కడ ఆస్కారం ఉందో ప్రభుత్వం చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఇష్టం అన్నదానికి పరిమితులేమిటి, అయిదేళ్లకోసారి ప్రభుత్వం మారితే రాజధాని మార్చవచ్చునా వంటి ప్రశ్నలు వస్తున్నాయి. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజధానిపై నియమించినన శివరామకృష్ణన్ కమిటీ సిపార్సును తోసిపుచ్చి ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకుందని,మంత్రి నారాయణతో వేసిన కమిటీలోని రాజకీయవేత్తలు వ్యాపారవర్గాల సలహాలు తప్ప నిపుణల భావాలకు విలువ ఇవ్వలేదని ప్రభుత్వం వాదిస్తోంది. గుంటూరు విజయవాడ మధ్య రాజధాని వద్దని శివరామకృష్ణన్ కమిటీ చెప్పింది. అక్కడ సారవంతమైన భూములు కాపాడుకోవాలన్నది. హరిత రాజధాని, వివిధ విభాగాలు వేర్వేరు చోట్ల వుండే వికేంద్రీకృత రాజధాని, లేదంటే ఇప్పటికే అభివృద్ధి చెందిన నగరంలో రాజధాని అనే మూడు పద్దతును కమిటీ సూచించనదాన్ని తాము అమలు చేస్తున్నామని అన్నారు. వాస్తవానికి శివరామకృష్ణన్ అమరావతి నిర్ణయమైన తర్వాత కూడా అక్కడ విపరీత కేంద్రీకరణ సరికాదని హిందూలో వ్యాసం రాశారు. ఉపాధి, వ్యాపారాభివృద్ధికి అవసరమైన వ్యూహం ముఖ్యమని ఆయన సూచించారు. మొదట ముఖ్యమంత్రిగా వున్న కాలంలో ఐటి వంటివాటిని అభివృద్ధి చేసిన చంద్రబాబుకు తాను అభిమానినంటూనే ఇప్పుడు వనరులన్నీ అమరావతి లోనే గుమ్మరించడం ఆత్మహత్యాసదృశమని కూడా ఆయన స్పష్టీకరించారు. శివరామకృష్ణన్ ఇచ్చిన మూడు అవకాశాలలో హరిత రాజధాని అనేది తాము ఎంచుకున్నామని తెలుగుదేశం తరపున కొందరు చేసిన వాదనకు ఇది సమాధానంగా వుంటుంది. మరోవంక టిడిపి సిపిఐ వంటిపార్టీతో కలిసి సిపిఎం కార్యదర్శి మధు ఆందోళనలో పాల్గొనకుండా ఉన్నారు. అమరావతి ఉద్యమం మరింత బలం పుంజు కుంటుందని చెప్పారు. అయితే ఎవరో ఒకరి చుట్టూ తిరగకుండా పదిమందినీ కలుపుకుని ముందుకు పోవాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. వాస్తవంగా టిడిపినే గతంతో పోలిస్తే కొంత హడావుడి తగ్గించింది. హ?కోర్టులో కేసు నడుస్తున్న తీరు, పార్టీస్పందను చూస్తే వాతావరణం కొంత మారుతుందా అనిపిస్తుంది.వైసీపీ మద్దతుతో ఇళ్ల స్థలాల పేరిట మూడు రాజధానులకు మద్దతుగా దళిత బహుజన సంఘాలతోఆందోళన నడిపించడం, ఇరు శిబిరాల మధ్య ఘర్షణలు వాదనలు జరగడం కూడా గతంలో లేని పరిణామం. హైకోర్టు తీర్పుపై జగన్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లడం ఖాయమే అయినా మూడు రాజధానుల నిర్ణయం ప్రతిష్టంభనలో పడుతున్నట్టే కనిపిస్తుంది. లక్ష కోట్లు ఒక్కచోట ఖర్చు చేయడం వల్ల అభివృద్ధి కేంద్రీకృతమవుతుందని, మూడు చోట్ల వుంటే దాంతో పాటే అభివృద్ధి వికేంద్రీకరణ అవుతుందని ప్రభుత్వం తరఫున చీఫ్‌జస్టిస్ జెకె.మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం ముందు చెప్పారు.

# పోలవరం సవరించిన అంచనాలు ఆమోదించండి

### -కేంద్రమంత్రి గజేంద్ర సింగ్‌కు ఎపి మంత్రుల వినతి

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలను ఆమోదించాలని కేంద్ర జలవనరులశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఏపీ మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వీరు శుక్రవారం ఢిల్లీలో షెకావత్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ సవరించిన అంచనాలను ఆమోదించాలని కేంద్ర మంత్రికి విన్నపించారు. 2017-18 సవరించిన అంచనాలను ఆమోదించాలని కోరారు. కేంద్ర ఆర్థిక శాఖ వద్ద అంచనాల పెంపు వ్యవహారం పెండింగ్‌లోఉందని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే మంత్రి నిర్మలా సీతారామన్‌ను పలుమార్లు కలిసి అంచనాల పెంపుపై చర్చించినట్లు ఏపీ మంత్రులు పేర్కొన్నారు.

భేటీ అనంతరం మంత్రి అనిల్ మీడియాతో మాట్లాడుతూ...పోలవరం ప్రాజెక్టు నిధుల అంశంపై కేంద్రమంత్రితో చర్చించాం. 2017లో జరిగిన పొరపాట్ల వల్ల పోలవరానికి ఇబ్బందులు ఉన్నాయి. వాటిని కేంద్ర మంత్రికి వివరించాం. వాటిపై అవగాహన ఉందని, ప్రాజెక్టు ముందుకెళ్లేలా చూస్తామన్నారు. ప్రాజెక్టులో తాగునీటి విభాగాలను తొలగించారు. అవికూడా ఉంచాలని కోరాం. విభజన చట్టంలో పోలవరంపై తాగునీటి అవసరాల అంశం కూడా ఉంది. పరిహారం, పునరావాసంపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పోలవరం ప్రాజెక్టును సందర్శించాలని కేంద్రమంత్రిని కోరాం. 15 రోజులలోపే పోలవరం వస్తానని చెప్పారు. అనుకున్న సమయానికే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని మంత్రి అనిల్ వివరించారు.ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రానికి న్యాయపరంగా రావాల్సిన నిధులపై కేంద్రమంత్రులను కలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకోవడంతో పోలవరానికి సమస్య వచ్చిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల చిక్కుముడులను ఒక్కొక్కొటిగా విప్పుకుంటూ వస్తున్నమని తెలిపారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులకు విప్రో శుభవార్త

ముంబై,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో 2021లో ఇంజనీరింగ్ పూర్తి చేయనున్న ఇంజనీరింగ్ విద్యార్థులకు శుభవార్త అందించింది. ఎలైట్ నేషనల్ టాలెంట్ హంట్ 2021 ని ప్రకటించింది. దేశవ్యాప్తంగా మంచి టాలెంట్ ఉన్న ఇంజనీర్ గ్రాడ్యుయేట్స్‌కు ఉద్యోగాలు ప్రాజెక్ట్ ఇంజనీర్ ఇవ్వబోతోంది. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లాంటి స్ట్రీమ్స్‌లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఆన్‌లైన్ పరీక్ష, హెచ్ఆర్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. వార్షిక వేతనం రూ.3.50 లక్షలుగా ఉంటుందని విప్రో తెలిపింది. ఈ మేరకు విప్రో ట్విటర్ ద్వారా వివరాలను షేర్ చేసింది. వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు వెల్లడించింది.

# వెంటనే జీహెచ్ఎంసీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

### ఉద్యోగుల సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తుంది: లక్ష్మణ్

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ నూతన పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ అన్నారు. కొత్తగా గెలిచిన ప్రజాప్రతినిధులను ప్రభుత్వం విశ్వాసంలోకి తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని గురువారం నాడిక్కడ ఆరోపించారు. టీఆర్ఎస్‌లో అంతర్మథనం ప్రారంభమైందని చెప్పారు. గ్రేటర్ కొత్త పాలక మండలి ఏర్పాటు చేయకుండా ఫిబ్రవరి వరకు గడువు ఉందని అంటున్నారు, ఫిబ్రవరి వరకు గడువు ఉన్నప్పుడు ముందస్తుగా ఎందుకు ఎన్నికలు నిర్వహించావు..? అంటూ లక్ష్మణ్ ప్రశ్నించారు. గ్రేటర్ అప్పుల మయం అయింది, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేదని లక్ష్మణ్ ఆరోపించారు.

ఎన్నికల సంఘం ప్రభుత్వం తొత్తుగా వ్యవహరించకుండా పాలక మండలి ఏర్పాటు చేయాలని, తెలంగాణ ప్రభుత్వం ఎక్కువ రోజులు మనుగడ సాధించదని అభిప్రాయ పడ్డారు.

టీఆర్ఎస్ నేతల్లో అంతర్మథనం మొదలైయిందని లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులను కేసీఆర్ ఎలా వాడుకున్నాడో అందరికీ తెలుసనీ మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అన్నారు. ఉద్యమకారులను కేసీఆర్ పట్టించుకోవడం లేదని, అందుకే ఉద్యమ కారులంతా ఏకం కావాలని అన్నారు . ఉద్యమ కారుల గొంతులు కోసే కేసీఆర్ ను గద్దె దించాలన్నారు. తెలంగాణ వచ్చాక అన్ని వర్గాలను పక్కన పెట్టి ఆయన కుటుంబం కోసమే కెసీఆర్ పని చేస్తున్నారని అన్నారు. కాంట్రాక్ట్‌ల వద్ద కమిషన్ లు దండుకోవడం, ఆస్తులు సంపాదించుకోవడమే కెసీఆర్ చేసే పని అన్నారు. ఏపీ ప్రభుత్వం శ్రీశైలం నుంచి తమ రాష్ట్రానికి నీటిని తరలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ కెసీఆర్ మాత్రం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మరచి ఫాం హౌస్‌లో పడుకున్నాడని అన్నారు. విజయశాంతి బీజేపీలో చేరడాన్ని తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. తెలంగాణా కోసం పోరాటం చేసిన వ్యక్తి విజయ శాంతి అని, పార్లమెంటులోనూ ఆమె పోరాటం చేశారని అన్నారు. తెలంగాణ బిల్లు వచ్చే సమయంలో పార్లమెంటు లో కేసీఆర్ లేదని.. విజయశాంతితో పాటు తాము అందరం ఉన్నామని వివేక్ అన్నారు.

# వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు లేవు

### ఎప్పటిలాగేనే వాటిని చేసుకోవచ్చు: హైకోర్టు

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): వ్యవసాయేతర ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని, పాత పద్దతిలోనే వాటిని చేసుకోవచ్చని తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రిజిస్ట్రేషన్లపై స్టే ఇవ్వలేదని మరోసారి స్పష్టం చేసింది. వ్యవసాయేతర ఆస్తులను గతంలో మాదిరే కంప్యూటర్ ఆధారిత విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ధరణి పోర్టల్ లో వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల విషయమై గురువారం తెలంగాణ హైకోర్టు విచారించింది. పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్లకు అభ్యంతరం లేదన్న ధర్మాసనం తేల్చి చెప్పింది. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా సీఏఆర్డీ పద్దతి కొనసాగించాలని పిటిషన్ తరపు న్యాయవాదులు కోరగా.. ఆన్ లైన్ స్లాట్ బుకింగ్ గతంలో లాగా రిజిస్ట్రేషన్ చేసుకునే విదంగా చూడలని అడ్వొకేట్ జనరల్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్‌కు ప్రాపర్టీట్యాక్స్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని వాదించారు. హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వకుండా ప్రభుత్వమే రిజిస్ట్రేషన్లను ఆపిందని పిటిషనర్ తరపు న్యాయవాదులు ధర్మాసనానికి వివరించారు. ధరణి వివరాలు మాత్రమే ఆపాలని చెప్పామని, రిజిస్ట్రేషన్‌పై ఎలాంటి స్టేలు ఇవ్వలేదని హైకోర్టు స్పష్టం చేసింది. స్లాట్ బుకింగ్‌తోపాటు పీటీఐఎన్ పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ చేయాలని సూచించింది. ధరణి పోర్టల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. అనంతరం తతుపరి విచారణను డిసెంబర్ 16కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది.

# ఏలూరు ఘటనపై కారణాలు వెతికే పనిలో ప్రభుత్వం..

### సిఎస్ నేతృత్వంలో హై పవర్ కమిటీ ఏర్పాటు కమిటీలో 21 మంది ఉన్నతాధికారులకు చోటు

అమరావతి,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ఏలూరులో వింత వ్యాధి మిస్టరీ ఇంకా కొనసాగుతోంది. కారణాన్ని తెలుసుకునేందుకు ప్రభుత్వంతో పాటు ప్రఖ్యాత సంస్థలు యత్నిస్తున్నాయి. ఇప్పటికే ఢిల్లీ ఎయిమ్స్, ఎన్ఐఎన్, సీసీఎంబీ లాంటి పలు ప్రతిష్టాత్మక సంస్థలు పరీక్షలు చేస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా కారణాలు తెలుసుకునేందుకు హైపవర్ కమిటీ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ నేతృత్వంలోని 21 మంది ఉన్నతాధికారులతో కూడిన హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రజలు అస్వస్థతకు గురవడానికి గల కారణాలు విశ్లేషిస్తుంది. కమిటీ ఛైర్ పర్సన్‌గా నీలం సాహ్నీ, కన్వీనర్ గా వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వ్యవహరిస్తారు. క్షేత్రస్థాయిలో కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు కూడా సూచించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.ఇప్పటికే ప్రజలు అస్వస్థతకు గురైన ప్రాంతాల్లో నీరు, పాలు, కూరగాయలు, ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించిన నిపుణులు వాటిని ల్యాబ్ ల్లో పరీక్షిస్తున్నారు. అలాగే బాధితుల బ్లడ్ శాంపిల్స్ పైనా పరిశోధన జరుగుతోంది. రక్త నమూనాల్లో సీసం, నికెల్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అలాగే నీటిలో ప్రమాదకర స్థాయిలో రసాయనాలున్నట్లు వెల్లడైంది. ఇప్పటికే ఆయా సంస్థల నిపుణులతో సీఎం వైఎస్ జగన్ చర్చించారు. కారణాలపై మరోసారి భేటీకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా తన వంతు ప్రయత్నంగా కారణాలు తెలుసుకునేందుకు యత్నిస్తోంది.ఇందులో భాగంగానే ఉన్నతాధికారులతో కూడిన కమిటీని నియమించింది.ప్రభుత్వం నియమించిన హై పవర్ కమిటీలో సీఎస్ నీలం సాహ్నీతో పాటు పశు సంవర్ధకశాఖ, పర్యావరణ, శాస్త్రసాంకేతికశాఖ, జలవనరులశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, పురపాలకశాఖ సెక్రటరీ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ ముకేష్ త్రిపాఠీ, డబ్ల్యూహెచ్‌వో సౌత్ రీజియన్ నేషనల్ ప్రొఫెషనల్ ఆఫీసర్ ఆశిష్ కే సత్పతి, ఏపీకి చెందిన న్యూరో ఫిజిషియన్ చంద్రశేఖర్‌రెడ్డి, సిద్దార్థ మెడికల్ కాలేజ్ ఫిజిషియన్ మాలతి, ఏలూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ మోహన్, ఏపీ వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఢిల్లీ ఎయిమ్స్ క్లినికల్ టాక్సాలజీ హెచ్‌వోడీ అహ్మదుల్లా షరీఫ్, సీసీఎంబీ డైరెక్టర్ రాకేష్ మిశ్రా, ఐఐసీటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఎన్ఐఎన్ శాస్త్రవేత్త జే బాబు, ఢిల్లీ ఎయిమ్స్ ఎమ్మర్జ÷న్సీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ జంషెడ్ నాయర్, ఢిల్లీ ఎన్‌సీడీసీ డిప్యూటీ డైరెక్టర్ సంకేత్ కులకర్ణి, పూణెలి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ శాస్త్రవేత్త అవినాష్ ఉన్నారు.మరోవైపు ఇప్పటి వరకు ఈ వ్యాధి బారిన పడ్డ 609 మందిలో 543 మంది ఆసుపత్రుల్లో కోలుకొని డిశ్చార్జి అయ్యారు.. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నవారిలో 33 మందిని మెరుగైన చికిత్స కోసం విజయవాడ, గుంటూరు ఆసుపత్రులకు తరలించారు.

# వెల్దుర్తి సహకార సంఘాన్ని పరిశీలించిన నాబార్డు బృందం

మెదక్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): మెదక్ జిల్లాలోని వెల్దుర్తి సహకార సంఘాన్ని గురువారం నాబార్డు డీజీఎంలు శశాంక్, మనోహర్‌లాల్‌తో కూడిన బృందం సభ్యులు, రాష్ట్ర టెస్కాబ్ జీఎం సురేఖతో కలిసి పరిశీలించారు.

సంఘం ద్వారా అందిస్తున్న రుణాలు, రికవరీ, సేవలపై డీసీసీబీ సీఈవో శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డిని వారు అడిగి తెలుసుకున్నారు.

సంఘం రికార్డులను పరిశీలించిన వారు, రుణాల మంజూరులో తీసుకుంటున్న జాగ్రత్తలు, తీసుకుంటున్న పత్రాలతో పాటు ఏ విధంగా రికవరీ చేస్తున్నారు, సంఘం ఆదాయం, ఆస్తుల వివరాలు, విత్తనాలు, ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్లు వంటి వివరాలను తెలుసుకున్నారు. కంప్యూటరైజేషన్, ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. బృందంలో నాబార్డు ఏజీఎం షర్మిల, మేనేజర్లు సుబ్బారెడ్డి, సురభి, వరప్రసాద్ ఉన్నారు.

# ఎమ్మెల్యే ముత్తిరెడ్డి భూ కబ్జాపై చేర్యాల బంద్

**అఖిలపక్షం బంద్‌కు ప్రజల మద్దతు**
**పట్టణంలో ర్యాలీ తీసిన అఖిలపక్ష నేతలు**
**చెరువు వద్ద గోడ కూల్చిన నేతలు..**
**పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత**

సిద్దిపేట,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి భూ కబ్జాపై చేర్యాల మండల కేంద్రంలో అఖిలపక్ష నేతలు యుద్ధం ప్రకటించారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి వ్యతిరేకంగా బంద్ నిర్వహించారు. వ్యాపార వాణిజ్య సంస్థలు బంద్‌కు సహకరించాయి. ముత్తిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటాయి. ఎమ్మెల్యే పెద్దచెరువు మత్తడిని కబ్జా చేశారంటూ అఖిలపక్ష నేతలు ఆందోళనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు ఆందోళనలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పెద్దచెరువును కబ్జా చేసి.. తన కూతురి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని అఖిలపక్ష నేతలు ఆరోపించారు. చెరువు దగ్గర ఎమ్మెల్యే కట్టించిన గోడను కూలగొట్టారు. అఖిలపక్ష నేతల ఆందోళనను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. దాంతో వివిధ పార్టీల నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

గొడవ పెద్దది కావడంతో పోలీసులు లాఠీఛార్జి చేసి నేతలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే నేతలు మాత్రం పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకొని వచ్చి మరీ ఆందోళనకు దిగారు. మరోవైపు టీఆర్ఎస్ నేతలు కూడా పెద్ద చెరువు దగ్గరికి వచ్చి ఆల్ పార్టీ లీడర్లతో వాగ్వాదానికి దిగారు. ముత్తిరెడ్డి బారి నుంచి పెద్దచెరువును కాపాడాలని అడిగితే.. తమపై టీఆర్ఎస్ నేతలు దాడి చేశారని అఖిలపక్ష నేతలు అన్నారు. ముత్తిరెడ్డితో పాటు టీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని ఆల్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఆందోళనలతో చేర్యాలలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పాడ్డాయి.

## తమిళిసైని కలసిన దత్తాత్రేయ

హైదరాబాద్,డిసెంబర్11 (ఆర్ఎన్ఎ): హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నగరానికి చెందిన దత్తాత్రేయ హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తనను కలిసేందుకు వచ్చిన దత్తాత్రేయకు గవర్నర్ తమిళిసై సాదరంగా ఆహ్వానించారు. ఇరువురు గవర్నర్లు కొంత సేపు వివిధ అంశాలపై చర్చించారు. ఇది మర్యదపూర్వ భేటీ అని తెలిపారు.

# మౌంట్ ఎవరెస్ట్ శిఖరం ఎత్తు పెరుగుతోందా....!

సహజ పర్వతాలు ప్రకృతికి దివ్య ఆభరణాలు, సకల జీవరాశికి రక్షణ గొడుగులు, పర్యావరణ హితాలు మరియు జీవవైవిధ్య పోషకాలుగా ఎనలేని సేవలను అందిస్తున్నాయి. ప్రపంచ పర్వతాల్లో హిమాలయాలకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. హిమాలయాల్లోని మౌంట్ ఎవరెస్ట్ శిఖరం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతంగా చరిత్రలో నిలిచింది. ఎవరెస్ట్ పర్వతం 60 మిలియన్ల సంవత్సరాల క్రితం ఏర్పడిందని నిపుణులు అంచనా వేశారు. ఎవరెస్ట్ శిఖరం మంచుతో కప్పబడి, శిఖరాగ్రంపై 6గురు పర్వతారోహకులు మాత్రమే నిలబడగలిగే అవకాశం ఉంటుంది. గతంలో సర్వే ఆఫ్ ఇండియా, చైనా మరియు నేపాల్ ప్రయోగాల్లో ఎవరెస్ట్ ఎత్తు 8,848 మీటర్లు (29,017 అడుగులు)గా నిర్ణయించబడింది. 2015లో వచ్చిన 7.8 రిక్టర్ స్కేల్ భయంకర భూకంపంలో 9,000 మంది నేపాలీలు మరియు 18 మంది పర్వతారోహకులు మరణించారు. ఇలాంటి పెద్ద భూకంపాల వల్ల ఎవరెస్ట్ శిఖర ఎత్తు తగ్గే అవకాశం ఉందని వింటున్నాం. సముద్ర మట్టాన్ని ఆధారంగా చేసుకొని పర్వతాల ఎత్తును నిర్ణయిస్తారు. త్రికోణమితి, నేషనల్ నావిగేషన్ సాటలైట్ సిస్టమ్ మరియు జిపియస్ గణాంకాలతో 120 మంది భౌగోళిక విశ్లేషకులు నేపాల్ మరియు చైనా బృందం ఎవరెస్ట్ ఎత్తును ఖచ్చితంగా నిర్ణయించే కృషి చేశారు. గతం కన్న నేడు మౌంట్ ఎవరెస్ట్ ఎత్తు పెరిగిందనే ఆశ్చర్యకర విషయాన్ని బయట పెట్టింది.

నెపాల్ మరియు చైనా పరిశోధకుల బృందాలు 2019–2020లో ఎవరెస్ట్ శిఖరం వరకు చేరి ఎత్తును నిర్ణంచడం జరిగింది. నేపాల్ మరియు చైనా శాస్త్రజ్ఞుల బృందాలు మౌంట్ ఎవరెస్ట్ నేటి ఎత్తును 8848.86 మీటర్లు (29,031.69 అడుగులు) ఉందని ఏకాభిప్రాయానికి వచ్చారు. గత ఎత్తు 8,848 మీటర్లతో పోల్చితే నేడు 0.86 మీటర్లు (86 సెమీ లేదా దాదాపు 3 అడుగులు) పెరిగడం జరిగిందని రెండు దేశాల విదేశాంగశాఖ మంత్రులు వివరించారు. ఎవరెస్ట్ ఎత్తు పెరగడం ఓ ప్రత్యేక మరియు చారిత్రక అంశమని, అందరిని విస్మయానికి గురిచేసిన సందర్భమని తెలిపారు. పర్వతాల ఎత్తు పెరగడంలో 'టెక్టోనిక్ ప్లేట్స్ షిఫ్టింగ్' ప్రక్రియ మరియు తగ్గడంలో భూకంపాలు కారణాలు అవుతాయని తేల్చారు. 08 డిసెంబర్‌న నేపాల్ చైనా వెల్లడించిన వివరాల ప్రకారం పెరిగిన ఎవరెస్ట్ ఎత్తు వల్ల మానవాళికి ముప్పు ఏమీ ఉండదని, పర్వతారోహణకు ప్రయత్నించే సాహసికులకు మరి కొంత శ్రమించాల్సి ఉంటుందని అంటున్నారు. హిమాలయాల ఎత్తు సంవత్సరానికి 1 సెంటీమీటర్ మరియు మిలియన్ సంవత్సరాల్లో 10 కిమి పెరగవచ్చని అంచనా వేశారు. భౌగోళిక మార్పులతో పర్వతాల ఎత్తు ప్రభావితం అవుతుందని, అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ తన రికార్డులను తానే బద్దలు కొడుతూ, 86 సెమీ ఎత్తును పెంచుకొని, మబ్బులను చీల్చుకొని అనంత ఆకాశాన్ని ముద్దాడుతున్నది. ఎవరెస్ట్ ఎత్తులా మనిషి తనలోని మానవీయతను పెంచుకుంటూ ఎదగాలని ఆశిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## కాంగ్రెస్‌లోకి మాజీమంత్రి చంద్రశేఖర్

**త్వరలోనే అంటూ సంకేతాలు**

వికారాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన టిడిపి నేత, తరవాత టిఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎ.చంద్రశే ఖర్ బిజెపిలో చేరడానికి రంగం సిద్ధమయ్యింది. కాంగ్రెస్ పార్టీలో రాజకీయ శూన్యత కనిపించ డంతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మరోవవు తెలంగాణలో బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్‌కు మరింత పదను పెడుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి డా.ఎ.చంద్రశేఖర్ బీజేపీలోకి చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి పార్టీలోకి డీకే అరుణ ఆహ్వానించారు. చంద్రశేఖర్‌తో అరుణ సంప్రదింపులు దాదాపుగా పూర్తయినట్లు తెలుస్తోంది. ఆయన అతి త్వరలో బీజేపీలో చేరుతారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రశేఖర్ బీజేపీలో చేరేందుకు ముహూర్తం కూడా సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. బీజేపీ పెద్దల సమక్షంలో వికారాబాద్‌లో భారీ బహిరంగ సభ పెట్టి పార్టీలో చేరుతారని చంద్రశేఖర్ సన్నిహితులు చెబుతున్నారు. వాస్తవానికి గతంలో సీఎం కేసీఆర్‌తో సత్సంబంధాలు కలిగిన చంద్రశేఖర్ ఒక సమయంలో టీఆర్ఎస్‌లో ఒక వెలుగు వెలిగారు. తెలంగాణ రాష్ట్రానికితొలి ముఖ్యమంత్రి దళితుడుని చేస్తామని వికారాబాద్‌లో కేసీఆర్ ప్రకటించడంతో చంద్రశేఖరే సీఎం అవుతారని భావిం చారు. ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో చంద్రశేఖర్ మంత్రిగా పనిచేశారు. అయితే తరువాత కాలంలో పార్టీలో జరిగిన అనేక పరిణామాల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు.

2019లో ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఇపుడు ఆయన్ని బీజేపీలోకి తీసుకువచ్చేందుకు కమలనాథులు చర్చలు జరిపారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన మరో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ కూడా బీజేపీలో చేరతారనే ప్రచారం సాగుతోంది. గ్రేటర్ ఎన్నికల్లో విజయపరంపర కొనసాగించిన భారతీయ జనతాపార్టీ వైపు ఇతర పార్టీలకు చెందిన అనేకమంది నేతలు ఆకర్షితులవుతున్నారు. వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధమవు తున్న బీజేపీ.. ఆయా పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలను తమవైపు తిప్పుకునేందుకు పావులు కదుపుతోంది. ముఖ్యంగా కొందరు కాంగ్రెస్ నేతలతోపాటు అధికార టీఆర్ఎస్‌కు చెందిన నేతలతో కూడా చర్చలు మొదలు పెట్టింది.

# ఖమ్మంలో చెత్తసేకరణకు బ్యాటరీ ఆటోలు

**ఐదు వాహనాలను ప్రారంభించిన మంత్రి పువ్వాడ**



ఖమ్మం,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో చెత్త సేకరణకు ఇకనుంచి బ్యాటరీ ఆటోలను వినియోగించనున్నారు. గృహాల నుండి తడి, పొడి చెత్త సేకరణ కోసం బ్యాటరీతో నడిచే ఐదు ఆటోలను రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఒక్కో వాహనం ఖరీదు రూ.1.50 లక్షలు కాగా ఐదు వాహనాలు రూ.7.50 లక్షలతో అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రానున్న రోజుల్లో 60 డివిజన్లలో 120 వాహనాలు సమకూర్చుకుని ప్రతి డివిజన్లలో రెండు వాహనాలతో తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించనున్నట్లు చెప్పారు. అనంతరం మున్సిపాలిటీ సమకూర్చిన 2 లక్షల తడి, పొడి చెత్త డబ్బాలను మంత్రి పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలో ఉన్న 75 వేల ఇళ్లకు పంపిణీ చేయాలని, ప్రజల్లో తడి, పొడి చెత్తపై పూర్తి అవగాహన కల్పించాలని స్వయం సహాయక సంఘాలకు సూచించారు. అదేవిధంగా రూ.1.05 కోట్లతో వ్యయంతో ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల పరిపాలన భవన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

# కౌలు రైతులకు రుణాలిచ్చేందుకు ముందుకు రావాలి

**విత్తనం నుంచి పంట అమ్మేవరకూ రైతులకు అండగా ఆర్‌బీకేలు**
**రైతు భరోసా ద్వారా రూ.13,500 చెల్లిస్తున్నాం**
**బ్యాంకర్ల సమావేశంలో సిఎం జగన్**

అమరావతి,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): రైతులకు 99 శాతం పంటరుణాలు ఇచ్చారని, వారి ఆదాయం రెట్టింపుపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 213వ ఎస్ఎల్‌బీసీ సమావేశం నిర్వహించారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, గౌతమ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ విపత్తులు వచ్చినప్పుడు రైతులను ఆదుకోవాలన్నారు. పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, రైతు భరోసా ద్వారా రూ.13,500 చెల్లిస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

వడ్డీలేని రుణాల కింద గతంలో ఉన్న బకాయిలను చెల్లించాం. పంటల బీమా రూపంలో రైతులపై భారం లేకుండా చేశాం. రైతులు కట్టాల్సిన ప్రీమియంను మేమే కడుతున్నాం. 10,641 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. విత్తనం నుంచి పంట అమ్మేవరకూ ఆర్‌బీకేలు రైతులకు అండగా ఉంటాయి. కౌలు రైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలి. ప్రస్తుతం ఇస్తున్న రుణాలు ఆశాజనకంగా లేవు. జగనన్న తోడు కింద చిరువ్యాపారులకు రూ.10వేలు వడ్డీలేని రుణాలిస్తున్నామని' సీఎం తెలిపారు. అసంఘటిత రంగంకూడా ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తోంది.

ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించిన ఈ చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డు కూడా ఇస్తున్నాం. వారు ఏపని చేస్తున్నారో కూడా గుర్తిస్తున్నాం.

రాష్ట్ర ప్రభుత్వం వీరు చెల్లించాల్సిన వడ్డీలు చెల్లిస్తుంది. వడ్డీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఉంటుంది. చిరు వ్యాపారుల జీవితాలను మార్చడానికి బ్యాంకర్లు ముందడుగు వేయాలన్నారు. ఆసరా, చేయూతల ద్వారా మహిళల స్వయం సాధికారితకు అడుగులు వేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల జీవితాలను మార్చేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్న మహిళలు కుటుంబంలో అత్యంత ప్రభావంతమైన మహిళలు, లబ్దిదారైన మహిళకు నాలుగేళ్లపాటు నాలుగు దఫాల్లో రూ.75 వేలు అందుతాయి. ప్రతి ఏటా రూ.18750లు అందుతాయి. ఇప్పటికే ఒక ఏడాది ఇచ్చాం, తర్వాత మూడు సంవత్సరాలు కూడా ఇస్తాం.

ఈ డబ్బు గ్యారెంటీగా ప్రభుత్వం ఇచ్చే సొమ్ముగా బ్యాంకర్లు పరిగణలోకి తీసుకోవాలి. ఈ డబ్బు వారి జీవితాలను మార్చేందుకు ఉపయోగపడాలి. దీని కోసం అమూల్, అలానా, ఐటీసీ, ప్రొక్టర్ అండ్ గాంబల్, హెయూఎల్, రియలన్స్ లాంటి ప్రఖ్యాత సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. మహిళలకు నష్టం రాకుండా, వారి కాళ్లమీద వారు నిలబడేలా కార్యక్రమాలు రూపొందించాం. వారు ఎంపిక చేసుకున్న వ్యాపారాలకు బ్యాంకర్లు ముందుకు రావాలి. ఈ ప్రాజెక్టుకు బ్యాంకర్లు ముందుకు రావాలి, గట్టిగా మద్దతు పలకాలి. సమిష్టి కృషితో ముందుకు సాగాలి. చేయూత, ఆసరా మహిళలకు అండగా నిలబడ్డానికి గ్రామ, వార్డు స్థాయిల్లో కమిటీలను కూడా ఏర్పాటు చేశాం. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పంపిణీకి షెడ్యూల్ ఏర్పాటు చేసుకున్నాం.

ఇప్పటికే పంపిణీ ప్రారంభమైంది. ఆ షెడ్యూల్ ప్రకారం మహిళలకు సహాయం అందించేలా బ్యాంకర్లు కార్యాచరణ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వాధికారులు కూడా షెడ్యూల్ ప్రకారం పంపిణీ జరిగేలా బ్యాంకర్లతో అనుసంధానం చేసుకోవాలి. స్వయం సహాయక సంఘాలు 2020?21 ఏడాదికి తమ ఖాతాల్లో రూ.7500 కోట్లు జమచేశాయి. కాని బ్యాంకులు ఇస్తున్న వడ్డీ కేవలం రూ.3 శాతం. కాని అదే బ్యాంకులు సుమారు 11 శాతం, 13 శాతం వడ్డీలు వసూలు చేస్తున్నాయి. సకాలానికి కట్టే రుణాలపై ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తున్న విషయాన్ని బ్యాంకులు పరిగణలోకి తీసుకోవాలి.

మహిళలను మరింత చైతన్య పరిచేలా బ్యాంకులు ముందుకు వెళ్లాలని బ్యాంకర్లను కోరుతున్నా. ఇక కుటుంబంలో ఒక మహిళ తన కాళ్లమీద తాను నిలబడిగలిగితే.. ఆ కుటుంబం వృద్ధిలోకి వస్తున్నట్టే..

ఎంఎస్ఎంఈలకు అండగా నిలబడాలి. వారికి తోడ్పాటునందించాలి, అప్పుడే ఆర్థిక వ్యవస్థ కూడా బాగుంటుంది. ప్రతి ఎంఎస్ఎంఈలో కనీసం 10 మంది జీవనోపాధి పొందుతున్నారు. వారికి సహాయం అందించడంలో, రుణాలు రీస్ట్రక్చర్‌లో సహాయం చేయాలి. లక్ష్యాలను చేరుకోవాలి. 2014 నుంచి పరిశ్రమలకు రాయితీల బకాయిలను సుమారు రూ.1100 కోట్లు చెల్లించాం. అలాంటే ఫిక్స్ కరెంటు ఛార్జీల విషయంలో కూడా ఆదుకున్నాం. బ్యాంకులనుంచి కూడా వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలి టిడ్కో ఇళ్లను వీలైనంత త్వరగా ప్రభుత్వం పూర్తిచేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2.69 లక్షల యూనిట్లను 2021 డిసెంబర్, 2022 డిసెంబర్‌లోనూ విడతలుగా పూర్తిచేస్తుంది. దీనికి బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలని' సీఎం జగన్ పేర్కొన్నారు.

## ప్రేమజంట ఆత్మహత్య

సూర్యాపేట,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మునగాల మండలం మొద్దుల చెరువు సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఓ జంట ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించుకున్న వీరు పెళ్లి చేసుకునేందుకు కులాలు అడ్డు రావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తమ పెళ్లికి పెద్దతు అంగీకరించకపోవడంతోనే వారు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ఊరిబయట వీరు చెట్టుకు ఉరేసుకున్నారు. స్థానికుల ద్వారా

సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు ప్రేమ జంటగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ఇబ్రహీంపట్నంలో కేంద్ర బృందం ఉపాధి పనుల తనిఖీ




రంగారెడ్డి,డిసెంబర్11: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న అన్ని కంపోనెంట్ల కింద కూలీలకు పని కల్పించి సామాజిక వనరుల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సంయుక్త కార్య దర్శి రోహిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర బృందం ఇబ్రహీం పట్నం మండలంలో పర్యటించి ఉపాధి హామీ పనులను తనిఖీ చేసింది. పోల్కంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని కూలీలతో మాట్లాడారు. జాబ్ కార్డుల వారీగా కూలీలను పిలిచి, ఈ సంవత్సరం ఏ ఏ పనులు చేశారు, రోజు వారీగా ఎంత కూలి లభించింది, ఎన్ని రోజులకు ఒకసారి కూలి డబ్బులు జమ అవుతున్నాయి తదితర అంశాలను జాబ్ కార్డులో నమోదు చేసిన వివరాలతో అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు ఈ పథకం పట్ల మంచి అవగాహన ఉన్నదని రోహిత్ కుమార్ ప్రశంసించారు. అనంతరం పోల్కంపల్లి, రాయపోల్ గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పథకం సహకారంతో చేపట్టిన పండ్ల తోటల పెంపకం, పల్లె ప్రకృతి వనాల అభివృద్ధి, స్మశాన వాటికల అభివృద్ధి, డంపింగ్ యార్డుల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్, భూమి అభివృద్ధిలో భాగంగా లెవెలింగ్ పనులు, రాయపోల్‌లో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కల్పించుటకై రెండు కిలోమీటర్ల పొడవున రూ. 12 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు పనులను, సాగునీటి వసతుల అభివృద్ధికై చెరువులో చేపట్టిన పూడికతీత పనులను కేంద్ర బృందం పరిశీలించింది.

ఈ పర్యటనలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ డైరక్టర్ అమరేంద్ర ప్రసాద్ సింగ్, కన్సల్టెంట్ కిరణ్ కుమార్ పాండే, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎం. రఘునందన్ రావు , జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి స్పెషల్ కమిషనర్లు సైదులు, ప్రసాద్, జాయింట్ కమిషనర్ పి. జగత్ కుమార్ రెడ్డి, డీఆర్‌డీవో ప్రభాకర్, జీఎండీఐసీ రాజేశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిజెపి నేత కుమారుడు వివాహ వేడుకల్లో ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 11 (నేటినిజం ప్రతినిధి):బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్ర మహేష్ కుమారుడు వివాహ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అగ్రహారంలోఓ ఫంక్షన్ హాల్ లో వైభవంగా జరిగింది .ఈ వివాహ వేడుకల్లో ఆది శ్రీనివాస్ వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు .ఆయన వెంట అనుపురం ఎంపీటీసీ బాస రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామియాదవ్ ,కాంగ్రెస్ నాయకులు రాజు , కనికరపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 11 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యా కమిటీ చైర్మన్ పెద్ది శ్రీనివాస్ చేతులమీదుగా ఏకరూప దుస్తులు (యూనిఫాం లు ) పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం లో పౌష్టికాహారం ఉచిత ఏకరూప దుస్తులు, స్కాలర్ షిప్స్, డిజిటల్ తరగతులు, ఆంగ్ల బోధన మొదలగు సదుపాయాలను వినియోగించుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు, క్రమశిక్షణ తో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి .ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని .గతంలో తల్లిదండ్రులు వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించారని ఇవాళ కరోనా మహమ్మారి వలన పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి . కరోనా నేపథ్యంలో ఆర్థిక పరిస్థితులు ఏం బాగా లేవని దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారన్నారని, కరోనా పరిస్థితుల్లో ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లల్ని పంపేందుకు తల్లిదండ్రులు సుముఖంగా లేరని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ను ఆదరించి ప్రోత్సహించాలి.ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య అందుబాటులోకి వస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు కదారి నరేష్, రొండి చంద్రకళ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 11 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన మెరుపుల దేవయ్య అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిరోజుల క్రితం మృతి చెందగా నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలిచేందుకు శుక్రవారం గ్రామానికి చెందిన మడేల్ యూత్ సభ్యులు తమవంతు సాయంగా దేవయ్య కుటుంబ సభ్యులకు శుక్రవారం మూడు వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకుడు పులి మనోహర్, మడేల్ యూత్ సభ్యులు శ్రీహరి, అంజయ్య, రాములు, శంకర్, శ్రీనివాస్, కార్తీక్, వెంకటేష్,గణేష్, మధు, ప్రశాంత్, అజయ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## 9మంది పసికందుల మరణం

**కోటాలో దారుణ ఘటనపై ఆందోళన**

జైపూర్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): రాజస్థాన్ రాష్ట్రం కోటాలోని జేకే లోన్ ఆస్పత్రిలో ఘోర జరిగింది. కేవలం 24 గంటల వ్యవధిలో అక్కడ 9 మంది పసికందులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే అభం శుభం తెలియని చిన్నారులు అసువులు బాసారని బాధితులు ఆరోపిస్తున్నారు. కానీ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాత్రం పసికందుల మృతి విషయంలో తమ తప్పిదం ఏమీ లేదని చెప్పారు. తొమ్మిది మరణాల్లో ముగ్గురిని చనిపోయిన తర్వాతనే ఆస్పత్రికి తీసుకొచ్చారని, మరో ముగ్గురు పుట్టుక సంబంధ రుగ్మతలతో మృతిచెందారని, ఇంకో ఇద్దరు వేరే ఆస్పత్రుల నుంచి రిఫర్ చేస్తే ఇక్కడికి వచ్చారని తెలిపారు. కాగా, రాజస్థాన్ ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నది. ఈ అంశంపై దర్యాప్తు కోసం రాజస్థాన్ ఆరోగ్యశాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. నలుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీని మూడు పనిదినాల్లో దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించాలని ఆరోగ్యశాఖ ఆదేశించింది.

## టైమ్ మ్యాగ్జిన్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా జై బైడెన్

వాషింగ్టన్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్, ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కమలా హారిస్‌లు.. ఈ యేటి టైమ్ మ్యాగ్జిన్ పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ పత్రిక ప్రకటించింది. హెల్త్ కేర్ వర్కర్లు, అంటువ్యాధుల నిపుణుడు ఆంథోనీ ఫౌసీ, డోనాల్డ్ ట్రంప్ పోటీ పడ్డా.. డెమోక్రటిక్ జంటకే టైమ్ గౌరవం దక్కడం విశేషం. టైమ్ మ్యాగ్జిన్ కవర్‌పేజీపై బైడెన్, హారిస్ ఫోటోలను ప్రచురించారు. చేంజింగ్ అమెరికాస్ స్టోరీ అన్న సబ్‌టైటిల్ ఆ ఫోటోకు ఇచ్చారు. తాజాగా ముగిసిన అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్ 306 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లతో ట్రంప్‌ను ఓడించారు. ట్రంప్‌కు కేవలం 232 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. రిపబ్లికన్ నేత ట్రంప్ కన్నా.. బైడెన్‌కు సుమారు 70 లక్షల ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఒక క్యాలండర్ సంవత్సంలో అధిక ప్రభావం చూపిన వ్యక్తులను టైమ్ మ్యాగ్జిన్ తన కవర్‌పేజీలో ప్రచురిస్తుంది. వారినే పర్సన్ ఆఫ్ ఇయర్ అవార్డుతో సత్కరిస్తున్నది.

## మేఘాలయ సిఎం సంగ్మాకు కరోనా

షిల్లాంగ్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు కరోనా సోకింది. స్వల్పంగా లక్షణాలు కనిపించడంతో కరోనా పరీక్ష చేయించుకున్నారు. దీంతో కరోనా పాజిటివ్‌గా రిపోర్టు వచ్చింది. ఈ విషయాన్ని సంగ్మా స్వయంగా ట్విట్టర్‌లో శుక్రవారం వెల్లడించారు. తేలికపాటి కరోనా వైరస్ లక్షణాలున్నాయని, హోం ఐసొలేషన్‌లో ఉంటున్నట్లు పేర్కొన్నారు. గత ఐదు రోజుల్లో తనను కలిసినవారు తమ ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే కరోనా పరీక్ష చేయించు కోవాలని సూచించారు.

## ధర్మపురిలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ప్రారంభం

జగిత్యాల,డిసెంబర్11 : ధర్మపురి కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీసమేతంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రవి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఏఎంసీ చైర్మన్‌లు, సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ధర్మపురి మండలం క్యాంపు కార్యాలయం వేదికగా గ్రామాల వారిగా మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. 43 మందికి రూ. 12 లక్షల 81 వేలు చెక్కులుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com